


షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

సంపుటి : 2 సంచిక : 36 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 19 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 34 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 16 Decmbar 2024 PAGES : 8 PRICE : 5/-


# నీటి వనరులకు కొత్తరూపు



## ప్రజల దాహం తీర్చే అమృతధార

## గత ప్రభుత్వంలో చేసిన జల్ జీవన్ మిషన్ పనులన్నీ నిరుపయోగం


## కేరళ రూ.45 వేల కోట్లు ప్రతిపాదనలు ఇస్తే...

## ఆంధ్రప్రదేశ్ రూ.26 వేల కోట్లకే ప్రతిపాదనలే పంపింది



**అమరావతి**

విజయవాడలో బుధవారం నిర్వహించిన జల్ జీవన్ మిషన్ 'అమృతధార' వర్క్ షాపులో ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. జల్ జీవన్ మిషన్ పనుల్లో ప్రజల్ని భాగస్వామ్యం చేయాలి. ఇప్పుడున్న నీటి వనరులకు కొత్తరూపు తీసుకురావడంతో పాటు కొత్త నీటి వనరులను సృష్టించుకోవడం అవసరం. నీటి నిర్వహణ, సరఫరా విషయంలోనూ పటిష్టమైన ప్రణాళిక ఉండాల'ని ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే బృహత్తర ప్రణాళికకు అంతా కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. జల్ జీవన్ మిషన్ పనులకు ఎలా మొదలుపెట్టాలి... ఎలా ముందుకు తీసుకెళ్లాలి... పటిష్టంగా ఎలా పూర్తి చేయాలనే విషయాలను అధికార యంత్రాంగం సమన్వయం చేసుకొని పనిచేయాలని, కేవలం పనులు చేసి వదిలేయడం కాకుండా, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు (గ్రీవెన్స్) కోసం కూడా ప్రత్యేక సమయాన్ని కేటాయించాలన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం సమర్థంగా అమలు చేసేందుకు, జిల్లావారీగా ప్రత్యేక డీపీఆర్ తయారు చేసేందుకు, పథకం ఫలాలను వినియోగించుకునేందుకు అన్ని జిల్లాల పంచాయతీరాజ్, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా విభాగం అధికారులతో 'అమృతధార' కార్యక్రమం వర్క్ షాపును విజయవాడలో బుధవారం నిర్వహించారు. - మిగతా3లో



## నా వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించింది

- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ వ్యతిరేకి
- వీరసావర్కర్‌ను అవమానించినదీ, ఎమర్జెన్సీ విధించినదీ కాంగ్రెస్ పార్టీయే
- రాజ్యాంగ విలువలన్నింటినీ వాళ్లు కాలరాసారు
- తొలుత జనసంఘ్, ఆ తర్వాత భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ అంబేద్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తూనే ఉన్నాయి



## ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ అవమానిస్తోంది

- కాంగ్రెస్‌కు గట్టి కౌంటరిచ్చిన ప్రధాని మోదీ
- అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి కాంగ్రెస్ ప్రయత్నం
- షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎలాంటి విధివిధానాలను ఆచరిస్తోందో ప్రజలు చూస్తూనే ఉన్నారు
- 'కాంగ్రెస్ పార్టీ, దాని కుళ్లిన పర్యావరణ వ్యవస్థ రాజ్యాంగ నిర్మాతైన బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడాన్ని ద్వేషపూరిత అబద్ధాలు దాచగలవని భావిస్తే.. వారంతా పొరపాటుపడినట్టే

# కర్నూలు పర్యటనలో జగన్..

## వైసీపీ నేత సురేంద్ర రెడ్డి కుమార్తె రిసెప్షన్ కు హాజరైన జగన్

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వైసీపీ అధినేత

## కర్నూలు నుంచి తాడేపల్లికి జగన్



**కర్నూలు**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ మధ్యాహ్నం కర్నూలులో పర్యటించారు. కర్నూలులోని జీఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేంద్ర రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు డాక్టర్ చతుర, డాక్టర్ నిఖిల్ లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్వెన్షన్ సెంటర్ వద్దకు పెద్ద సంఖ్యలో వైసీపీ అభిమానులు చేరుకున్నారు. - మిగతా3లో



## జేపీసీలో ప్రియాంకాగాంధీ!

- 'వన్ నేషన్, వన్ ఎలక్షన్'బిల్లుపై ఏర్పాటు కాబోతున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ
- ప్రియాంకాగాంధీతోపాటు మనీష్ తివారి, సుఖ్‌దేవ్ భగత్, రణ్‌దీప్ సుర్జేవాలాకు కూడా జేపీసీలో చోటు
- ఒకే దఫా ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఒక బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చింది

# మూడేళ్లలో రాజధాని పూర్తి

- గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు
- రాజమహేంద్రవరంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సమీక్ష
- వచ్చే జనవరికి 62,000 కోట్లతో టెండర్లు పిలుస్తాం
- పుష్కరాలకు కేంద్ర నిధులు మంజూరు చేసే విధంగా ముఖ్యమంత్రి వద్ద చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం
- రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రధాన నగరాలు పట్టణాల మధ్య చెత్తతో విద్యుత్తు తయారీ ప్లాంట్లను నెలకొల్పుతాం



**రాజమహేంద్రవరం**

రాజమహేంద్రవరంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ చెప్పారు. పుష్కరాలకు కేంద్ర నిధులు మంజూరు చేసే విధంగా ముఖ్యమంత్రి వద్ద చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని చెప్పారు. రాజమహేంద్రవరం కాకినాడ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రధాన నగరాలు పట్టణాల మధ్య చెత్తతో విద్యుత్తు తయారీ ప్లాంట్లను నెలకొల్పుతామని అన్నారు. గుంటూరు, విశాఖలో ఈ ప్లాంట్లు అద్భుతంగా పనిచేస్తున్నాయని మంత్రి చెప్పారు. రాజమహేంద్రవరం - మిగతా3లో



## జమిలి బిల్లును కాంగ్రెస్ సమర్థించదు

- జమిలి ఎన్నికల బిల్లుపై వైఎస్ షర్మిల కీలక వ్యాఖ్యలు
- అసెంబ్లీల గడువును లోక్ సభతో ముడిపెట్టడం సరికాదు: షర్మిల
- బీజేపీ రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకురావాలనుకుంటున్నారని విమర్శ
- లోక్ సభలో ఓటింగ్ వ్యవహారం బీజేపీకి బెడిసికొట్టిందని వ్యాఖ్య

**అమరావతి**

భారత రాజ్యాంగంపై బీజేపీ దాడి కొనసాగుతూనే ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచి బీజేపీ రాజ్యాంగం అమల్లోకి తెచ్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలోనే జమిలి ఎన్నికల బిల్లులను బీజేపీ లోక్‌సభలో ప్రవేశపెట్టిందని అన్నారు. - మిగతా3లో

## ఏపీలో పెట్టుబడులదారుల కోసం

# కొత్త విధానం

- రాష్ట్రంలో ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌తో నిరంతర పర్యవేక్షణ, సకాలంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తున్నాం
- ఎస్ఐపీసీ ప్రాజెక్టు మానిటరింగ్ మెకానిజమ్‌పై పెట్టుబడుల ప్రతిపాదనల పర్యవేక్షణ చర్యలు
- కొన్ని శాఖలకు జిల్లా స్థాయిలో పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నోడల్ అధికారిగా నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది
- సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

**అమరావతి**



వచ్చిన పెట్టుబడుల ఫలాలు సకాలంలో అందేలా ఏపీలో వినూత్న విధానం అమలులోకి తీసుకురానున్నట్లు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌తో నిరంతర పర్యవేక్షణ, సకాలంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఎస్ఐపీసీ ప్రాజెక్టు మానిటరింగ్ మెకానిజమ్‌పై పెట్టుబడుల ప్రతిపాదనల పర్యవేక్షణ చర్యలపై బుధవారం సీఎస్ సమీక్ష నిర్వహించారు. - మిగతా3లో

# నీటి వనరులకు కొత్తరూపు

-మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ. "గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల తాగు నీటి అవసరాలను గుర్తించి ముందుకు వెళ్లాలి. జల్ జీవన్ పనులన్నీ ప్రజలకు ఫలాలు అందించాల్సిన తరుణంలో వారి సూచనలకు పెద్దపీట వేయాలి. జన వనరుల లభ్యత, వాటి నుంచి పొందాల్సిన ప్రయోజనం, ఇతర అంశాలను నిశితంగా పరిశీలించి శాశ్వతంగా ఫలితాలు అందేలా జల్ జీవన్ మిషన్ పనులను మొదలుపెట్టాలి.




## ఇప్పటికీ తాగు నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు

స్వాతంత్ర్యానంతరం భారతదేశం ప్రజలకు తాగు నీటిని అందించేందుకు లక్షల కోట్లను ఖర్చు చేసింది. ప్రతి మనిషికి స్వచ్ఛమైన తాగు నీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ప్రతి మనిషికీ సగటున రోజుకి 55 లీటర్ల మంచి నీరు అందించాలనే ఉన్నత లక్ష్యంతో 2019లో జల్ జీవన్ మిషన్ పథకం ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షల మేరకు మొదలైంది. భీష్మ ఏకాదశి రోజు ఉపవాసం సందర్భంగా కాని, రంజాన్ రోజుల్లో ముస్లిం సోదరులు పాటించే ఉపవాస దీక్షల్లో గాని ఒక పూట నీరు అందకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో చాలా మందికి తెలుసు. 2008లో ఆదిలాబాద్ తండాల్లో తిరుగుతున్నపుడు చూపులేని ఓ వృద్ధురాలు కాస్త నీళ్లిప్పించయ్యా.. అన్న మాట నాకెప్పుడూ తల్చుకున్నా కళ్లలో గిర్రున నీళ్లు తిరిగేలా చేస్తాయి.

నా శాఖల్లో అత్యంత కీలకమైంది.. నాకు ఇష్టమైంది గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి అందించే కీలక బాధ్యత. స్వచ్ఛమైన తాగునీరు అందితే ప్రజల సంతోషం అంతాఇంతా కాదు. వారికి స్వచ్ఛమైన నీరు అందితే చాలావరకు ఇతర సమస్యలు తొలగిపోతాయి. ప్రజలంతా ఆనందంగా ఉండటానికి మంచినీరు అందడం అనేది ప్రధానం.

## కేరళ కంటే తక్కువగా ప్రతిపాదనలు

ఈ మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టాక జల్ జీవన్ మిషన్ పనుల గురించి పలుమార్లు సమీక్ష చేశాను. ఇంతటి కీలకమైన పథకం, ప్రజలందరికీ మేలు చేసే ఈ పథకం తీరుతెన్నులను, జరిగిన పనులను తెలుసుకున్నాను. అనుకున్నంత విజయవంతంగా పనులు జరగలేదని అర్థమైంది. 2019లో జల్ జీవన్ మిషన్ పథకం ప్రారంభించే ముందు ప్రతి రాష్ట్రం తాగునీటి అవసరాలకు సంబంధించి, ప్రతి ఒక్కరికీ తాగునీరు అందించేందుకు ఎంత మేర నిధులు అవసరం అవుతాయని కేంద్ర ప్రభుత్వం – రాష్ట్రాలను ప్రతిపాదనలు అడిగినపుడు ఉత్తర ప్రదేశ్ రూ.1.50 లక్షల కోట్లు, మధ్యప్రదేశ్ రూ.83 వేల కోట్లు, గుజరాత్ రూ.32 వేల కోట్లు, కేరళ రూ.45 వేల కోట్లు అడిగింది. కేరళను తీసుకుంటే ఆంధ్రప్రదేశ్ కంటే చాలా చిన్న రాష్ట్రం. అయినప్పటికీ వారు భవిష్యత్తు అవసరాలు, ప్రజలకు అందించాల్సిన పూర్తి తాగునీటి పనులు కావాలంటే నిధులు ఎక్కువ అవసరమవుతాయనే ప్రణాళికతో అంత మొత్తం అడిగారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం గత ప్రభుత్వ పాలకులు మాత్రం కేవలం రూ.26 వేల కోట్లు చాలు అన్నట్లుగా ప్రతిపాదనలు పంపారు.

## గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వలేదు

దీంతో కేంద్రం మొదటి దశలో రూ.4,787 కోట్ల పనులు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో కచ్చితంగా రాష్ట్ర వాటాగా మ్యాచింగ్ గ్రాంటు కేటాయించాలనే నిబంధన ఉంటుంది. జల్ జీవన్ మిషన్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తగిన మ్యాచింగ్ గ్రాంటు కూడా విడుదల చేయకపోవడంతో కేంద్రం ఇచ్చిన నిధులను కూడా సద్వినియోగం చేసుకోలేకపోయాం. పథకం ఆశయాలకు తూట్లు పొడిచి బోర్ వెల్స్ కు అనుసంధానం

జల్ జీవన్ మిషన్ పనుల్లో శాశ్వత నీటి వనరుల మీద దృష్టి సారించడం అనేది కీలకం. కొత్త ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సూచనల ప్రకారం జల్ జీవన్ మిషన్ పథకంలో రిజర్వాయర్లు, నీటి వనరుల నుంచి నీటిని ఎంత సమర్థంగా గ్రామాలకు అందించాలనే విషయంలో కసరత్తు చేశాం. ఇటీవల కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ కలిసినప్పుడు కూడా రాష్ట్ర తాగు నీటి అవసరాలకు మేరకు, జల్ జీవన్ మిషన్ పథకం లక్ష్యాల మేరకు కనీసం రూ.70 వేల కోట్లు అవసరం అవుతాయని, రాష్ట్రానికి కేటాయించిన నిధులను పెంచాలని కోరాను. దీనికి కేంద్ర మంత్రివర్యులు మీకు రూ.70 వేల కోట్ల అవసరాలకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సమర్పించాలని కోరారు. దీనిపై ఇప్పుడు దృష్టి సారించాం. రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు సురక్షిత మంచి నీరు అందించేందుకు అవసరమైన పనులకు సంబంధించిన పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టును జనవరిలోగా రూపొందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. దీన్ని కేంద్ర మంత్రివర్యులకు పంపుతాం అని అన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, గ్రామీణ రక్షిత తాగునీటి సరఫరా విభాగం చీఫ్ ఇంజినీర్ సంజీవరెడ్డి గారు, జలవనరుల చీఫ్ ఇంజినీరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# 1941లో 129 కోట్లు 2021 నాటికి 55,548 కోట్లు



**ఏలూరు :** ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు. ఏలూరు జిల్లా పోలవరం సమీపంలో నిర్మిస్తున్న బహుళార్థ సాధక నీటిపారుదల పథకం. విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలలోని మెట్టప్రాంతాలకు సాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా గుర్తించింది. మొదట్లో రామపాద సాగర్ గా పిలిచిన ప్రాజెక్టును ప్రస్తుతం పోలవరం సాగునీటి ప్రాజెక్టు అని పిలుస్తున్నారు. 1941లో అప్పటి నీటిపారుదల ఇంజినీర్ ఎల్.వెంకటకృష్ణ అయ్యర్, పోలవరం సమీపంలో గోదావరిపై రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదనలపై ఓ నివేదికను రూపొందించారు. మొదట్లో దీని వ్యయం రూ.129 కోట్లు. 2021 తాజా అంచనాల ప్రకారం నిర్మాణ వ్యయం రూ.55,548.87. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముఖ్యంగా మూడు భాగాలున్నాయి. రిజర్వాయర్, స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం. ప్రధాన రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు స్పిల్‌వే ఉపయోగపడుతుంది. పోలవరం వద్ద రెండు కొండల మధ్య 48 గేట్లుతో స్పిల్ వే నిర్మిస్తున్నారు. ఈ రిజర్వాయల్ రెండు కాలువలు(కుడి, ఎడమ) ఉంటాయి. ఈ ప్రాజెక్టులో మరో ముఖ్యమైన కట్టడం డయాఫ్రం వాల్. దీనిని గోదావరి నది మధ్యలో దాదాపు 300 అడుగుల లోతులో నిర్మిస్తున్న కాంక్రీటు గోడ. సుమారు 2.454 కిలోమీటర్లు పొడవులో దీనిని నిర్మిస్తున్నారు. డయాఫ్రమ్ వాల్ కు ఇరువైపులా ఎర్త్ కమ్ రాక్ డ్యామ్ నిర్మిస్తున్నారు. పోలవరం ప్రధాన డ్యామ్ నిర్మాణంలో నీరు అడ్డుతగలకుండా తాత్కాలికంగా నిర్మించే కట్టడమే కాఫర్ డ్యాం అంటారు. పోలవరం ప్రాజెక్టులో రెండు కాఫర్ డ్యామ్ లను ప్రతిపాదించారు. ప్రాజెక్టు ఎగువన ఒకటి, ధవళేశ్వరం బ్యారేజీ బ్యాక్ వాటర్ రాకుండా దిగువున మరో కాఫర్ డ్యాం నిర్మించాలని నిర్ణయించారు. 2014 రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. 2013–14 ధరల ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ బడ్జెట్ రూ.58,319 కోట్లు. 2017 పోలవరం అంచనాలను ఏపీ సర్కార్ సీడబ్ల్యూసీకి సమర్పించింది. 2004లో ప్రారంభమైన పోలవరం ప్రాజెక్టును...2014లో జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. 2017 జూన్ నాటికి రిజర్వాయర్ లో మట్టిపని 68%, కరకట్ట 9%, కుడికాలవ పనిలో మట్టిపని 100%, లైనింగ్ 81%, ఎడమకాలవ పనిలో మట్టిపని 87%, లైనింగ్ 62% పూర్తి అయ్యాయి. 2021 మే నెల నాటికి 42.5 మీటర్ల ఎత్తులో కాపర్ డ్యాం నిర్మాణం పూర్తి చేశారు. స్పిల్‌వే లో 14 గేట్ల ద్వారా నీటి తరలింపునకు ఏర్పాట్లు చేశారు. పెరిగిన వ్యయాలతో పోలవరం వ్యయ అంచనాలు పెంచి, కొత్త ప్రతిపాదనలు ఆమోదం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతుంది. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం...కాంట్రాక్టర్ ను మార్చింది. ఈ ప్రాజెక్టు పూర్తిపై మంత్రులు పలు సందర్భాల్లో భిన్న ప్రకటనలు చేశారు. అయితే 2024లో అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం...2027 నాటికల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించింది. ప్రతి నెలా ఓ సోమవారం సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తూ...పనులు పురోగతిపై సమీక్షిస్తున్నారు. 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తుంది. డయాఫ్రంవాల్ నిర్మాణంతోపాటు ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం పనులను వేగంగా పూర్తి చేయడాన్ని మొదటి ప్రాధాన్యంగా పెట్టుకుంది. వరదలతో కుంగిన గైడ్‌బండ్‌ను తిరిగి నిర్మించడానికి ప్రణాళిక చేస్తుంది. స్పిల్ ఛానల్, ఐకానిక్ వంతెన పనులు త్వరలో చేపట్టనున్నారు. గత టీడీపీ పాలనలో 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేసినట్లు నేతలు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 17, ఇతర జిల్లాల్లోని 54 మండలాల్లో 7.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు. పోలవరం నిర్వాసితులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 13 ప్రాంతాల్లో కాలనీలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే పోలవరం మండలంలోని 19 గ్రామాల ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేశారు. వీరికోసం ఒక్క ప్రాంతంలో కూడా పూర్తి సౌకర్యాలతో కాలనీలు ఏర్పాటు కాలేదు. డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, రోడ్లు, ఆసుపత్రి, పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు, ఇతర సౌకర్యాలు లేక నిర్వాసితులు అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పునరావాస కాలనీలు ప్రారంభించిన రూ.210 కోట్ల మేర బిల్లులను బకాయి పడ్డాయి. కూటమి ప్రభుత్వం తాజాగా పాత బకాయిలతో పాటు పునరావాసానికి మరో రూ.502 కోట్లు ప్రకటించింది. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 12 వేల ఎకరాల భూసేకరణ చేశారు. మరో 25 వేల కుటుంబాలను నిర్వాసితులుగా ప్రకటించారు. ఇందులో 41.15 కాంటూరు పరిధిలో 44 గ్రామాలు 10 వేల కుటుంబాలు ఉన్నాయి. పునరావాసం, పరిహారం విషయంలో నేటికీ 10–20 శాతం వరకే పూర్తైందనేది వాస్తవం. దశాబ్దాలుగా పోలవరం ప్రాజెక్టు రెండడుగులు ముందుకి, మూడడుగులు వెనక్కి అన్నట్లు ఉంది. పోలవరం నిర్మాణానికి వైఎస్ఆర్ ప్రభుత్వ హయంలో జలయజ్ఞం పేరిట కొంత కదలిక వచ్చింది. డ్యామ్ పనులతో పాటు కాలువల పనులు కొంతమేర జరిగాయి. టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పూర్తి చేసేందుకు ప్రయత్నించినా ఆర్థిక వనరులు ప్రధాన అడ్డంకిగా మారాయి. 2016లో ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యతను తీసుకుంది. దీంతో కేంద్రం మెలికపెట్టింది. 2013 అంచనాల మేరకు మాత్రమే నిధులు సమకూరుస్తామని చెప్పింది. 2013 నాటి అంచనాల మేరకు రూ. 20,338 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంటుంది. 2017–18 ధరల సూచీ ప్రకారం పోలవరం అంచనా వ్యయాన్ని రూ. 55,657 కోట్లుగా ఇటీవల నిర్ణయించారు. దీనికి కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు ఆర్థిక వనరుల సమస్య అడ్డురావడంతో ప్రాజెక్టు ముందుకు సాగడంలేదు. నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్, ప్రాజెక్టు వ్యయం భారీగా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం కోసం కేంద్రం వైపు చూస్తుంది.

## కర్నూలు పర్యటనలో జగన్..

-మొదటిపేజీ తరువాయి

అందరికీ అభివాదం చేస్తూ ఆయన ముందుకు సాగారు. బెంగళూరులో ఉన్న జగన్ ప్రత్యేక హెలికాప్టర్ లో కర్నూలుకు చేరుకున్నారు. కర్నూలు నుంచి ఆయన తాడేపల్లికి వెళ్లారు. తాడేపల్లిలో కీలక వైసీపీ నేతలతో ఆయన భేటీ అవుతారు.

## ఏపీలో పెట్టుబడులదారుల కోసం కొత్త విధానం

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని శాఖలకు జిల్లా స్థాయిలో పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నోడల్ అధికారిగా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు.

యూనిట్లు ఏర్పాటుకు పెట్టుబడుల ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహం, ఎగుమతుల కమిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పరిశ్రమ ఏర్పాటులో డీపీఆర్ స్థాయి నుంచి యూనిట్ గ్రౌండింగ్ అయ్యే వరకూ ట్రాకర్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. దీని కోసం ఎస్ఐపీసీ ప్రాజెక్టు మానిటరింగ్ మెకానిజమ్ కింద ఇకపై ప్రత్యేక ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ తీసుకొస్తామన్నారు. ఒక సమర్థవంతమైన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రాష్ట్రంలో ఏర్పాటవుతున్న ప్రాజెక్ట్‌లను ట్రాక్ చేయడపమే ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.

ఇన్వెస్టర్లు ప్రాజెక్ట్‌ల పురోగతి చెక్ చేయడానికి ఇన్వెస్టర్లు లాగిన్ అయి పరిశీలించు కోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రాజెక్ట్ ఏర్పాటులో బాటిల్ నెక్స్ గుర్తించి సకాంలో పరిష్కరించేందుకు, ప్రభుత్వాలకు డేటా ఆధారిత సమాచారం ఇకపై అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఐఅండ్ఐ, ఐటీ అండ్ సి, ఫుడ్ ప్రాసెసింగ్, నెడ్ క్యాప్ తదితర 14 విభాగాలకు చెందిన లైన్ డిపార్టుమెంట్లు ఈ ఇన్వెస్టుమెంట్ ట్రాకర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. వారానికి ఒకసారి దీనిపై నివేదికలు సమర్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్లు కూడా ఎప్పటికప్పుడు ఈట్రాకర్ డాష్ బోర్డును మానిటర్ చేయాలని అధికారులకు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

## మూడేళ్లలో రాజధాని పూర్తి

-మొదటిపేజీ తరువాయి

నగరపాలక సంస్థ సమీక్ష సమావేశం మంత్రి నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజమహేంద్రవరం నగరంలో వివిధ పన్నులు 70 కోట్ల బకాయిలు ఉన్నాయని ప్రజలు వాటిని చెల్లించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు చేశారు. మూడు సంవత్సరాల్లో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని వచ్చే జనవరికి 62,000 కోట్లతో టెండర్లు పిలుస్తామని తెలిపారు. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం పురపాలక నగరపాలక సంస్థల నిధులను దారిమళ్లించిందని ప్రజలపై దారుణంగా పన్నుల భారం మోపిందని నారాయణ అన్నారు. ఈ సమీక్షా సమావేశానికి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకట్రావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు చొరవతో చెత్త పన్నును ఎత్తేసినట్లు ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. అంతే కాకుండా చెత్త పేరుకుపోకుండా చైనా తరహాలో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి నారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. 2019 లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే 2021 కే పోలవరం పూర్తి అయ్యుండేదని అన్నారు. మూడేళ్లలో రాజధాని అమరావతి పనులను పూర్తి చేస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రాజమండ్రిలో పుష్కరాలను నిర్వహించే విషయమై సీఎంతో సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

### పెట్రోల్ బంకును ప్రారంభించిన మంత్రి

రాజమహేంద్రవరం క్వారీ సెంటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ను పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రారంభించారు. ఐఓసీ సౌజన్యంతో నగరపాలక సంస్థ ఈ పెట్రోల్ బంకును ఏర్పాటు చేసింది. దీని ద్వారా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు చెందిన వాహనాలతోపాటు ప్రజల వాహనాలకు డీజిల్, పెట్రోలును అందిస్తారు. ఈ పెట్రోల్ బంక్ ద్వారా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వాహనాలకు డీజిల్ ఖర్చు తగ్గనుందని మంత్రి చెప్పారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 123 పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో సొంతంగా మరికొన్ని పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు.

## జమిలి బిల్లును కాంగ్రెస్ సమర్థించదు



-మొదటిపేజీ తరువాయి

పూర్తి మెజార్టీ లేకపోయినా రాజ్యాంగ వ్యతిరేకంగా బిల్లులను ప్రవేశపెట్టడం బీజేపీ నిరంకుశ విధానానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇది ఫక్తు నియంతృత్వ చర్య అని వ్యాఖ్యానించారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ఈ జమిలి ఎన్నికల బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని షర్మిల తెలిపారు. రాజ్యాంగ సవరణలకు కావాల్సిన మూడింట రెండొంతుల మెజారిటీ బీజేపీకి లేదని లోక్‌సభలో ఓటింగ్‌తో తేలిందని చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వం పడిపోతే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎందుకు కుప్పకూలాలని ప్రశ్నించారు. ఇందులో ఏమన్నా అర్థముందా అని మండిపడ్డారు. సభలో రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు మోదీ సర్కారు ప్రయత్నించిందన్నారు. చివరకు ఓటింగ్ వ్యవహారం బీజేపీకే బెడిసికొట్టిందని తెలిపారు. రాజ్యాంగంలోని ఇటువంటి కీలకాంశాలను సవరించే అధికార పరిధి పార్లమెంటుకు లేదని షర్మిల తెలిపారు. జమిలి ఎన్నికలు జరపాలంటే కేంద్ర, రాష్ట్రాల చట్టసభలకు నిర్ణీత కాల వ్యవధి కల్పించే ఆర్టికల్ 83, 172లను కూడా సవరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అసెంబ్లీల గడువును లోక్‌సభతో ముడిపెట్టడం ప్రజా తీర్పును అపహాస్యం చేయడమే అని విమర్శించారు. తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఐదేళ్ల కాలానికి ఎన్నుకునే హక్కు ప్రజలకు ఉంటుందని తెలిపారు. జమిలి ద్వారా దానికి గండికొట్టే అధికారం కేంద్రానికి లేదని చెప్పారు. దేశంలో నియంతృత్వాన్ని తీసుకురావడమే బీజేపీ ఉద్దేశమని అన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించే జమిలి ఎన్నికల బిల్లుల ఆమోదానికి కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో సహకరించదని స్పష్టం చేశారు.

ముడుపుల వ్యవహారంలో మోదీ, అదానీకి భయపడి చంద్రబాబు మౌనం

అదానీ, జగన్ మధ్య కుదిరిన విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో ముడుపుల బాగోతాన్ని తేల్చడంలో కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని చేస్తున్నాయని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. స్వయంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు అదానీ గ్రూప్స్ రూ.1750 కోట్లు లంచాలు ఇచ్చారని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ రిపోర్టు ఇస్తే కేంద్రంలో మోదీ , రాష్ట్రంలో చంద్రబాబు కనీసం నోరు విప్పడం లేదని ట్విటర్‌లో విమర్శించారు. అదానీపై చర్యలు తీసుకోవాలని ఏపీసీసీ నిర్వహించిన ఛలో రాజ్ భవన్‌ను పోలీసులు అడ్డుకోవడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ముడుపులపై విచారణ సైతం జరిపించడం లేదని, అదానీ మీద ఈగ కూడా వాలనివ్వడం లేదని మండిపడ్డారు . అదానీ దేశం పరువు, ఖ్యాతిని ప్రపంచం ముంగిట తీస్తే, లంచాలు తీసుకొని వైసీపీ అధినేత జగన్ రాష్ట్రం పరువు తీశారని ఆరోపించారు. స్వలాభం కోసం విద్యుత్‌ను ఎక్కువ రేటు పెట్టి కొని జనం నెత్తిన రూ.1.50లక్షల కోట్ల భారం వేశారని అన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందం పెద్ద కుంభకోణం అని తీవ్ర ఆరోపణలు చేసిన తెలుగుదేశం ఇప్పుడు మోదీకి, అదానీకి భయపడి మౌనం పాటిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అదానీపై విచారణకు వెంటనే జేపీసీ వేయాలని. రాష్ట్రంలో రూ.1750 కోట్ల ముడుపులపై ఏసీబీ ని రంగంలోకి దించాలని డిమాండ్ చేశారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 19.12.24 గురువారం



బధిరుల జోనల్ స్థాయి టీ-20 క్రికెట్ పోటీల టీంను అభినందించిన కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా 4

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
ప్రకాశం

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)** ప్రజలకు, రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందని, ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను



సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు మండలం, రాచవారిపాలెం గ్రామ రెవెన్యూ సదస్సు నకు జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా హాజరై భూ సమస్యల పై ప్రజల నుండి అర్జీలను స్వీకరించి అర్జీవారీగా పరిశీలన చేసి, పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన భూ సంబంధ సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకుని వాటినీ పరిష్కారం అయ్యే విధంగా రెవిన్యూ అధికారులు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో భూ సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందని, ఈ సదస్సులను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సంబంధిత రికార్డులు పరిశీలించేందుకు ప్రజలకు, రైతులకి దిశా నిర్దేశం చేయాలని సూచించారు. వచ్చిన ప్రతి అర్జీకి ఎండార్స్మెంట్ ఇవ్వడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మి ప్రసన్న, తహశీల్దార్ సుజన్, రెవిన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఢీ కొట్టిన ఏపిఓ కారు

## మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి, భార్య పరిస్థితి విషమం



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, డిశంబర్ 18)** త్రిపురాంతకం మండలం అన్న సముద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం పలు అనుమానాలకు తావిస్తుంది.గతంలో ఉపాధి హామిపథకంలో పని చేసిన ఫీల్డ్ అసిస్టెంట్, ఐటిడిఏలో ప్రత్యేక అధికారిగా పని చేస్తున్నా ఓ ఏపిఓ కారును ఢీ కోని వైద్యసేవలు పొందుతు మృతి చెందిన విషయం చర్చాంశ నీయంగా మారింది. బుధవారం త్రిపురాంతకం మండలంలోని అన్న సముద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ఫీల్డు అసిస్టెంట్ రొడ్డా గంగారాజు తీవ్రంగా గాయపడి వినుకొండలో వైద్య సేవలు పొందుతు మృతి చెందాడు. ఇతనికి వర్షిత అనే కూతూరు 10 సం, ఒక కుమారుడు శ్రీరాం 12 సంవత్సరాలు ఉన్నారు. ప్రమాధం జరిగిన సమయంలో ద్వి చక్ర వాహనంపై అతని బార్య ఉండటంతో ఆమెకు కూడా తీవ్ర గాయాలైనట్లు సమాచారం. దీంతొ మృతుడి కుటుంభంలో తీవ్ర విషాద చాయలు నెలకొన్నాయి.

### నాన్న ఎక్కడున్నావు....

మృతుడు రొడ్డా గంగరాజు మృతి చెందిన విషయం తెలియగానే అతని కుమార్తే వర్షిత, కుమారుడు శ్రీరాం వారి నాన్న సెల్ కు పదే పదే ఫోన్ చేయడం చూపరులకు కంటతడి పెట్టించింది. ప్రతి నిత్యం ఇంటికి వస్తు పిల్లలకు ఫోన్ చేసి ఏం కావాలిరా తల్లి ఏం కావాలిరా నాన్నా అంటూ పలుకరించే ఫోన్ రాక పోవడంతో గంగరాజు కుటుంబమంతా తల్లడిల్లిపోయారు. ఏ దుర్భర పరిస్థితి ఎదురొచ్చిందో....యమధర్మరాజు ఏ రూపంలో వచ్చాడో... తండ్రిలేని పిల్లలుగా గంగారాజు కుటుంబం మిగిలిపోవడం విషాదకరం. మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబ పెద్దను కబలించిన ఏపిఓ వాహనం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



# కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్‌కు అనుమతులు

## ఏపీ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)** ప్రకాశం జిల్లా కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్‌కు కేంద్ర ప్రభుత్వం అంగీకరించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో కేంద్ర ఓడరేవులు మరియు నౌకాయన శాఖ మంత్రి శరాబానంద సోనోవాల్ ను కలసి కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని కోరడం, వెంటనే కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా కొత్తపట్నం వద్ద సింగ్ హార్బర్ ఏర్పాటుతో ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు అవసరమైన 40 ఎకరాల భూమిని గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

# భద్రతా చర్యల పై డెమో డ్రిల్





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)** సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షణ, సంఘ విద్రోహ చర్యలను నిర్వీర్యం చేయుట, పౌరులకు భద్రతా భావాన్ని కల్పించే చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఎక్స్‌ప్లోజివ్స్ ఉన్నట్లు అనుమానాస్పదమైన బ్యాగు ఉంచి ఆ ప్రదేశంలో దాన్ని గుర్తించి చేపట్టాల్సిన భద్రతా చర్యల పై డెమో డ్రిల్ నిర్వహించారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు భద్రతా పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆ ప్రదేశానికి ఎవరిని వెళ్లకుండా పౌరులు బాధ్యతగా వ్యవహరించటం గురించి, పోలీసులు చేసే విధివిధానాలు గురించి క్షుణ్ణంగా ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా బ్యాగు ఉన్నట్లు వచ్చిన సమాచారంపై వెంటనే పోలీసులు బీడీ టీం, స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్స్ స్క్వాడ్ తో సంఘటన ప్రదేశానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. స్పెషల్ పార్టీ, బీటీ టీం సిబ్బంది ఆర్టీసీ బస్టాండ్ చుట్టుపక్కల క్షుణ్ణంగా పరిశీలించి అనుమానస్పద బ్యాగ్‌ను గుర్తించారు. ఆ బ్యాగులో పేలుడు పదార్థాలు ఉన్నట్లుగా స్నాపర్ డాగ్ గుర్తించింది. ప్రజలు ఆ ప్రదేశానికి ఎవరిని వెళ్లకుండా క్యూ మేనేజర్ ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది బాంబు డిస్పోజల్ సూట్ ధరించి ఆ ఎక్స్‌ప్లోజివ్ నిర్వీర్యం చేశారు. ఈ డెమో డ్రిల్ ద్వారా భవిష్యత్తులో సంభవించే అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఏమైనా అనుమానస్పదంగా బ్యాగులు, వ్యక్తులు, ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 సమాచారం అందించాలని పోలీస్ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు వన్ టౌన్ ఎస్ఐ త్యాగరాజు, ఆర్ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. (తరువాయి 4లో...)



# భద్రతా చర్యల పై డెమో డ్రిల్





# బధిరుల జోనల్ స్థాయి టీ-20 క్రికెట్ పోటీల టీంను అభినందించిన కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్18)
జిల్లా స్థాయిలో విజయం సాధించి ఈనెల 19వ తేదీ నుంచి నెల్లూరులో జరిగే బధిరుల జోనల్ స్థాయి టీ-20 క్రికెట్ పోటీల్లో పాల్గొనే టీమును కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అభినందించారు. వీరికి అవసరమైన ఆట వస్తువులు, టీషర్టులను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ తరపున బుధవారం తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అందించారు. జోనల్ స్థాయిలోనూ విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

# వీరేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు విద్యుత్ కన్సర్వేషన్ పై అవగాహన సదస్సు

## మండల విద్యుత్‌శాఖ అధికారి పి శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 18)
మండల పరిధిలోని వీరేపల్లి మోడల్ స్కూల్లో బుధవారం మండల విద్యుత్‌శాఖ అధికారి పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యుత్ కన్సర్వేషన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్యుత్ పొదుపు - మార్గాలు, విద్యుత్ సౌర్యం-నివారణ, మార్గాలు, విద్యుత్ పొదుపులో భాగంగా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు గురించి వివరణ, విద్యుత్ ప్రమాదాలు -నివారణ, మొదలైన వాటి గురించి విద్యుత్ శాఖ అధికారి విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి శ్రీనివాసులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# భూముల పరిరక్షణకే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకువచ్చాం

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిశంబర్ 18)
భూముల పరిరక్షణ కోసమే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం అమలులోకి తెచ్చామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులు విచ్చలవిడిగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారని, ఇదే దరిమడుగు గ్రామంలో వైసీపీ నాయకుల బారినపడి చాలా మంది భూములు కోల్పోయారని, ఇటువంటి భూకబ్జాదారుల భరతం పట్టడానికి ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. త్వరలోనే భూకబ్జాదారులకు శిక్షలు పడతాయని అన్నారు. ఎవరైనా భూ సమస్యలు ఉంటే అర్జీల రూపంలో రెవెన్యూ అధికారులకు సమర్పించాలన్నారు. తదనంతరం దాని పై పూర్తి విచారణ చేసి న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజలు భారీ ఎత్తున అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, దరిమడుగు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.









# భూ కబ్జా చేసిన స్థలాన్ని తనిఖీ చేసిన వెలిగండ్ల తహసీల్దార్



(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, డిశంబర్ 18)
మండలంలోని ఇమ్మడి చెరువు గ్రామంలో దళితులు అయినా మాదిగ పల్లె వారికి సంబంధించిన స్మశాన వాటిక రహదారిని ఆ రహదారి ప్రక్కన ఉన్న తోట యజమాని రహదారిని కబ్జా చేసి బోర్లు వేశారు. గతంలో అనేకసార్లు తహసీల్దార్‌కు, ఆర్డీవోకు, ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. గత ప్రభుత్వం ఏమి పట్టించుకోకపోతే ఈ టిడిపి ప్రభుత్వ హయాంలోనైనా వారికి స్మశాన వాటికి రహదారి ఇవ్వాలని బుధవారం ఇమ్మడిచెరువు గ్రామంలో గ్రామ సభ నిర్వహించటానికి వచ్చిన స్థానిక తహసీల్దార్‌కు ఆ రహదారిని పూడ్చేసిన విధానాన్ని కనిగిరి నియోజకవర్గం ఎంఆర్పిఎస్ కో ఇన్చార్జి జెపి రాజు మాదిగ, వెలిగండ్ల మండల ఎమ్మార్పీఎస్ కో ఇంచార్జ్ పల్లె పోగు యోహాను మాదిగ ,గ్రామస్తులు కలిసి తాసిల్దారు వారికి చూపించడం జరిగింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంటనే గ్రామ సభకు కబ్జా చేసిన వ్యక్తిని పిలిపియమని స్థానిక విఆర్ఓకు అప్పిల్ చేయడం జరిగింది. ఎస్సీ మాదిగ కులస్తులకు రహదారి ఇప్పించే విధంగా సహకరిస్తానని ఎమ్మార్వో హామీ ఇవ్వడం జరిగింది. వారికి ఆ గ్రామస్తులందరూ రుణపడి ఉంటామన్నారు.

# పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులు కీలకం



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, డిశంబర్ 18)
గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్లు కీలక బాధ్యత వహించాలని మండల అభివృద్ధి అధికారి జాన్ సుందరం పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యా లయ సమావేశ మందిరంలో బుధవారం గ్రామ సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు ఎంపీడీఓ పర్యవేక్ష ణలో సుస్థిర అభివృద్ధి-లక్ష్యాలపై శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృ ద్ధి, ప్రణాళికలపై చర్చించారు. గ్రామాల అభివృ ద్ధిలో ప్రజా ప్రతినిధులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారు. డీఎల్డీఓ మాట్లాడుతూ జనవరి నుంచి ఉపాధి హామీ పథకంలో కూలీ రేట్లు పెంచనున్నట్లు చెప్పారు. అనంతరం మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసిన వాళ్ల అర్పించారు. సమావేశంలో ఎంఈఓ శ్రీనివాసులు, గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బిజెపి నీచ రాజకీయాలను విడనాడాలి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 18)
బిజెపి మహనీయులపై నీచ రాజకీయాలను చేస్తూ రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో న్యాయశాఖ మంత్రిగా పనిచేస్తున్న అమిత్ షా అనైతిక వ్యాఖ్యలు చేస్తూ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వారి త్యాగాలను అవహేళన చేసే విధంగా పార్లమెంట్లో అనైతిక వ్యాఖ్యలు చేయటం దురదృష్టకరమని ప్రకాశం జిల్లా దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. బుధవారం కనిగిరిలో ఆయన ఒక సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించే విధంగా మాట్లాడడం సిగ్గుమాలిన చర్యని ఇటువంటి వారిని రాజ్యాంగ పదవిలలో ఉండటం ఏమాత్రం సరైనది కాదని వారిని దేశ ద్రోహం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపించవలసిన అవసరం పైన ఉందని అత్యున్నత పదవిలో ఉన్నటువంటి అమిత్ షా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదని దేశానికి దేశ ప్రజలకు యువతకు మార్గదిద్దేశం చేయవలసిన వ్యక్తి మహనీయులని విమర్శించడం సిగ్గుమాలిన చర్యని దేశంలో మతాలను కులాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య విద్వేషాలు చలరేగే విధంగా బిజెపి ప్రభుత్వం వివరించడం తగదని అన్నారు.

# సంఘాలు ఎన్ని ఉన్నా ఐకమత్యంతో ముందుండాలి

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)
ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కమ్మ భవన్ భూమి పూజకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. కమ్మ భవన్ ద్వారా కమ్మ కులానికే కాకుండా అన్ని కులాల్లోని పేదవర్గాలకు సహాయ, సహకారాలు అందించాలని ఆయన అన్నారు. స్థలదాత చిడిపోతు వెంకటేశ్వర్లు, అధ్యక్ష, కార్యదర్శులు మండవ మురళీకృష్ణ, ఆలా హనుమంతరావు తదితరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘాలు ఎన్ని ఉన్నా ఐకమత్యంతో సమాజానికి సేవ చేయడంలో ముందుండాలని పేర్కొన్నారు. ఇంతటి మంచి కార్యక్రమానికి కమ్మవారి సేవా సంఘం ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అధ్యక్షులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ కమ్మ భవన్ నిర్మాణభూమి పూజకు హాజరైన దామచర్ల జనార్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాలు చేయడం లో కమ్మ సేవా వారి సంఘం ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సీతారామయ్య, గౌరవ సలహాదారులు క్విస్ విద్యా సంస్థల చైర్మన్ నిడమనూరి నాగేశ్వరరావు, హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, నాగు బోయిన భాస్కరరావు, కన్వీనర్ కాట్రగడ్డ రఘుపతిరావు, ఉపాధ్యక్షులు అబ్బూరి నవీన్ కుమార్, వడ్లమూడి లింగయ్య, పావులూరి బాపయ్య చౌదరి, జాయింట్ సెక్రటరీ లింగంగుంట సాయి వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కంచర్ల వెంకటనారాయణ, అధికార ప్రతినిధి రావుల పద్మజ, మహిళా అధ్యక్షురాలు వడ్డెంపూడి వెంకట సుజాత, యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డపాటి వెంకట్, గోగినేని రామారావు, సీతమ్మ, పోలినేని కిరణ్, కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.









## పుష్పమ్మ వర్ధంతికి చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

నెల్లూరు 14వ వార్డు పద్మావతి నగర్‌లో పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి మాతృమూర్తి పుష్పమ్మ వర్ధంతికి చిత్రపటానికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి కృష్ణారెడ్డిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, నీలి రాఘవరావు, 16వ డివిజన్ వైసీపీ అధ్యక్షులు సగిలి జయరామిరెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, దశరథ రామిరెడ్డి, లక్ష్మీరెడ్డి, శరత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురంలో రూ.5 కోట్ల విలువైన స్థలం కబ్జా



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిశంబర్ 18)

మార్కాపురం మండలం దరిమడుగు సమీపంలో ఆక్రమణకు చెరువు భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 2.31 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని తహశీల్దార్ చిరంజీవి తెలిపారు. భూమి విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని ఆయన వెల్లడించారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ హెచ్చరించారు.

## ముగిసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, డిశంబర్ 18)

తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక 2024- 25- స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల 2 రోజుల శిక్షణ కార్యక్రమంను ఎంపీడీఓ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఇంచార్జి ఎంపీడీఓ ప్రసాద్, ఇంచార్జి ఈఓపిఆర్డి చిరంజీవి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ స్థాయి అధికారులు(సచివాలయ సిబ్బంది), సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు (గ్రేడ్ 1-4), థీమాటిక్ ఎల్ఎస్‌డిజి లపై సంబంధించి రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయిలో 17, 18 తేదీలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పేదరికం లేని, మెరుగైన జీవనోపాధుల గ్రామం,ఆరోగ్యకరమైన గ్రామం, పిల్లల స్నేహపూర్వక గ్రామం, నీటి సమృద్ధి కలిగిన గ్రామం, పరిశుభ్రమైన, హరిత గ్రామం, స్వయం సంవృద్ధితో మౌలిక సదుపాయాల గల గ్రామం, సామాజిక న్యాయం, సామాజికంగా భద్రత కలిగిన గ్రామం, సుపరిపాలన కలిగిన గ్రామం, మహిళా స్నేహపూర్వక గ్రామం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

## కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ మాగుంట

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)

కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజారపు రామ్ మోహన్ నాయుడు జన్మదిన వేడుకల్లో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





# రాజంపల్లి చెంచులు నిజమైన చెంచులే

### ఎస్సీ, ఎస్టీ కేసులో రాజీకి, ఐటీడీఏ కాలనీ ఆక్రమణకు అడ్డుగా ఉన్నందుకే చెంచులపై తప్పుడు ఫిర్యాదులు

### మార్కాపురం సబ్ కలెక్టర్ ఎస్‌వి త్రివినాగ్‌కు తెలిపిన దళిత నేత నీలం నాగేంద్రరావు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిశంబర్ 18)

ఖరీదైన ఐటీడీఏ కాలనీ స్థలాన్ని కబ్జా చేసేందుకు, ఎస్సీ ఎస్టీ కేసులో రాజీ పడేలా చెంచుల్ని భయభ్రాంతుల్ని చేసేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగానే రాజంపల్లి చెంచులపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మార్కాపురం సబ్ కలెక్టరుకు తెలిపారు. బుధవారం పెద్దారవీడు మండలం రాజంపల్లి గ్రామంలో నివసించే చెంచుల కుల నిర్ధారణపై మార్కాపురం సబ్ కలెక్టర్ బిఎస్ వెంకట త్రివినాగ్, డిటిడబ్ల్యూ రాజేశ్వరి, ఐటీడీఏ ఏపీఓ సురేష్ బాబులు జరిపిన సంయుక్త విచారణకు నీలం నాగేంద్రరావు హాజరయ్యారు. డెమొక్రటిక్ జర్నలిస్టు ఫోరం యూనియన్ సభ్యులు పాలపర్తి సతీష్ తదితరులు రాజంపల్లి గ్రామంలో నివసిస్తున్న చెంచులు ముత్తరాశి కులస్తులని, వీరంతా చెంచులుగా చలామణి అవుతున్నారని ప్రకాశం జిల్లా కలెక్టర్కు అలాగే, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రాజంపల్లి గ్రామంలో విచారణ జరిగింది. రాజంపల్లిలో జరిగిన విచారణకు చెంచులపై దాడి చేసిన నిందితులతో కలసి, చెంచులపై ఫిర్యాదు చేసిన సతీష్ హాజరైన ఫోటోను సబ్ కలెక్టర్కు చూపించారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు సబ్ కలెక్టర్ త్రివినాగ్‌తో మాట్లాడుతూ రాజంపల్లి చెంచులు నిజమైన చెంచులే అనేందుకు తన వద్ద ఉన్న ఆధారాలను ప్రస్తావించారు. ప్రస్తుత పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాల ఊర తెగ చెంచులు 25 సంవత్సరాల క్రితం పెద్దారవీడు మండలం రాజంపల్లి గ్రామానికి వలస వచ్చారన్నారు. వ్యవసాయ పనులు, ఇటుక బట్టీలు వీరి జీవనాధారం అన్నారు. శ్రీశైలం ఐటిడిఏ రాజంపల్లి లో చెంచులకు కాలనీ, రోడ్లు, చర్చి, వాటర్ ట్యాంక్ నిర్మించిందన్నారు. వీరి కమ్యూనిటీ అవసరాల కోసం ప్రభుత్వం 60 సెంట్లు స్థలాన్ని కేటాయించిందన్నారు. ఈ 60 సెంట్లు స్థలాన్ని రాజంపల్లికి చెందిన పాశం నాగేశ్వరరావు తదితరులు ఆక్రమించారన్నారు. రెవిన్యూ అధికారులు గ్రామ సభ పెట్టి, ఆక్రమణలు తొలగించారన్నారు. దీంతో చెంచులపై కక్షపెంచుకున్న పాశం నాగేశ్వరరావు, కాసు వెంకటరెడ్డి తదితరులు 30 మంది 2021 జూన్ 10న మారణాయుధాలతో చెంచు కాలనీపై సామూహిక దాడి చేశారన్నారు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని, 12 మంది గాయపడ్డారని, జల్లా సాయి అనే యువకుడు కోమాలోకి వెళ్లాడన్నారు. పెద్దారవీడు పోలీసులు క్రైమ్



నెంబర్ 91/2021 గా ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసును విచారించిన మార్కాపురం డీఎస్పీ కిషోర్ కుమార్ నిందితులకు అనుకూలంగా వ్యవహరించి, కొందరు నిందితుల పేర్లతో పాటు కొందరు బాధితులైన సాక్షుల పేర్లను చార్జ్ షీటులో తొలగించాడన్నారు. దీంతో తన సూచన మేరకు బాధితులు ఎస్సీ ఎస్టీ కోర్టులో డీఎస్పీ తొలగించిన పేర్లు కేసులో ఉండాల్సిందేనని పిటిషన్ వేశారు. బాధితుల వాదనతో ఏకీభవించిన కోర్టు, మార్కాపురం డిఎస్పి తొలగించిన కాసు వెంకటరెడ్డి తదితర నిందితుల పేర్లను కేసులో కొనసాగించింది. తేదీ 10-06-2021, 91/21, 15 మంది మీద కేసు, పాశం నాగేశ్వరరావు తదితరులు 2024 సెప్టెంబర్ 10న ఎస్సీ ఎస్టీ కోర్టు ఈమేరకు ఆదేశాలు ఇచ్చింది.

చెంచులు ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాక, రాజంపల్లి చెంచులు ఎస్టీలు కాదని ముత్తరాశి కులస్తులని స్థానిక ఎస్సీ యువకుడు ఇస్రాయేలుతో నిందితులు మొదట ఫిర్యాదు చేయించారన్నారు. ఈ ఫిర్యాదు మేరకు డీఎస్పీ కిషోర్ కుమార్ రాజంపల్లి చెంచుల స్వస్థలమైన గుత్తికొండలో విచారించి వీరి కులాన్ని నిర్ధారించవలసిందిగా పిడుగురాళ్ల తహసిల్దారుకు లేఖ రాశారన్నారు. రాజంపల్లిలో నివసిస్తున్న చెంచులు గుత్తికొండకు చెందిన వారని, వీరంతా రాజంపల్లికి వలస వెళ్లారని పిడుగురాళ్ల తహసిల్దార్ నివేదిక ఇవ్వడంతో, డీఎస్పీ కిషోర్ కుమార్ నిందితులపై చార్జ్ షీట్ వేశారు. చెంచులకు నీరు కరెంటు నిలిపివేశారనీ, కరువు పనుల్ని కల్పించలేదన్నారు. దీంతో సగం మంది చెంచులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారన్నారు. ఎస్సీ ఎస్టీ కేసు నిందితులు కలిగిస్తున్న ఇబ్బందులను అధిగమించి స్థానికంగా నివాసం ఉంటున్న చెంచులను రాజంపల్లి నుంచి వెళ్లగొట్టాలని, చెంచులు పెట్టిన ఎస్సీ ఎస్టీ కేసులో చెంచులు రాజీ పడేలా వారిని భయభ్రాంతులను చేసి, వారిపై ఒత్తిడి పెంచేందుకు నిందితులు కుట్ర చేశారన్నారు. ఇందులో భాగంగానే, వేరొక ఫిర్యాదారున్ని ఆశ్రయించి మరో తప్పుడు ఫిర్యాదు చేయించారన్నారు.

పిడుగురాళ్ల తహసిల్దార్ సమాచార హక్కు చట్టం ద్వారా ఇచ్చినట్టుగా పాలపర్తి సతీష్ జిల్లా కలెక్టర్కు లోకాయుక్తకు చేసిన ఫిర్యాదులో జతపరిచిన జనన మరణాల పేజీ నకిలీ అని, సదరు పేజీ నకిలీ అనేందుకు గుర్తించిన ఆధారాలను, పిడుగురాళ్ల తహసిల్దార్ ఎండార్స్మెంట్ను నాగేంద్ర సబ్ కలెక్టర్కు చూపించారు. పాతికేళ్ల క్రితం రాజంపల్లికి వలస వచ్చి చెంచులుగా బతుకుతూ, కూలి పనులు చేసుకోవడమే తప్ప ఎస్టీ రిజర్వేషన్ ద్వారా ఈ 50 కుటుంబాల చెంచుల్లో పెద్దగా చదువుకున్న వారు గానీ, ఉద్యోగాలు చేస్తున్నవారు గాని లేరన్నారు. పాతికేళ్ల నుంచి చెంచులపై ఎలాంటి ఫిర్యాదు లేదని, చెంచు కాలనీ పక్కన కేంద్రీయ విద్యాలయం రావడంతో, ఆ స్థలాలకు మార్కెట్ విలువ పెరిగిందని, చెంచుల్ని ఆ స్థలాల నుంచి వెళ్ళగొట్టి ఆ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కొందరు స్థానికులు కుట్ర చేశాక చెంచులపై దాడులు, చెంచులపై తప్పుడు ఫిర్యాదులు మొదలయ్యాయన్నారు. స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత కూడా వారింకా పూరిగుడిసెల్లోనే నివాసం ఉంటున్నారని, ఆ నివాసాలను చూపించారు. అనంతరం చెంచుల పుట్టుక, వివాహం, మరణం కార్యక్రమాల్లో, అలాగే పండుగల్లో ఆచరించే ఆచార సాంప్రదాయాల గురించి, కొలిచే దేవతల గురించి నాగేంద్ర సబ్ కలెక్టర్‌కు వివరించారు.

స్వాతంత్రానికి ముందు, స్వాతంత్రం వచ్చిన తర్వాత చెంచులకు జీవనం, ఆచార సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, భాష, ఉనికికి సంబంధించి ప్రస్తావించిన ప్రభుత్వ పుస్తకాలను ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు సబ్ కలెక్టర్కు తెలియపరిచారు. ఒకటి రెండు రోజుల్లో రిటర్న్ ఆర్గుమెంట్స్ ఇస్తామని నాగేంద్ర సబ్ కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ప్రధాన కార్యదర్శి కాకుమాను రవి, దళిత నాయకులు మాలపోలు శాంత కుమార్, మాజీ సర్పంచ్ జల్లా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమామయుడు క్రీస్తు యేసు క్రీస్తు సందేశం శాంతి మార్గం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)

మెప్మా జిల్లా కార్యాలయం వద్ద మెప్మా సిబ్బంది నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో వాక్య ఉపదేశికులు రెవరెండ్ డి. అషేర్ పాల్ పాల్గొని క్రిస్తూ జనన ప్రసాస్థ్యం గురించి వివరించారు. పరిశుద్ధ గ్రంథం లోని ముగ్గురు వివేకవంతులైన స్త్రీలు ఎలిజెబెత్, మరియా, అన్నా అనే వారి గురించి సోదాహరణంగా తెలియపరచి ఆ రీతిగా ప్రతి క్రైస్తవ మహిళా జీవించాలని అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ భూలోకమునకు ఏసుక్రీస్తు పుట్టుక, సమస్త మానవాళికి కలిగే ఆనందం గూర్చి, యేసుక్రీస్తు జీవిత చరిత్ర వివరించారు. ఈ కార్యక్రమంనకు అధ్యక్షత వహించిన మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ తేళ్ల రవికుమార్ మాట్లాడుతూ..దేవుడు వెలుగు అయ్యి ఉన్నాడు. పేదరిక నిర్మూలన సంస్థ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఏర్పాటు చేయబడింది. క్రీస్తు భోదించిన, ఆచరించిన విధంగా సేవాతత్పరత, ప్రేమ, కరుణ, జాలి, శాంతి, సమాధానం, క్షమా గుణం కలిగి జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా ఎండి. జాఫర్ సాధిక్, ఇండియన్ పోస్టల్ సర్వీస్, సీనియర్ సూపరింటెండెంట్, ప్రకాశం డివిజన్ పోస్ట్ ఆఫీసెస్ మాట్లాడుతూ భారతదేశం పరమత సహనం కలిగిన లౌకిక దేశం, భిన్న మతాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలుతో జీవన వైవిధ్యం కలిగినప్పటికీ ఎంతో ఐక్యత, సంగీభవంతో జీవిస్తున్నామన్నారు. డిసెంబర్ మాసంలో క్రైస్తవాలు ఎంతో సంతోషంగా జరుపుకొనే క్రిస్టమస్ వేడుకలలో భాగస్వామ్యం అయినందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అందరికి ముందస్తు క్రిస్టమస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం. బ్రహ్మయ్య, కె. రవి వర్మ ఆలపించిన దేవుని పాటలు ఎంతగానో అలరించాయి. ఇంకా సీఓలు కె మరియమ్మ బైబిల్ పఠనం, రత్నకుమారి ప్రార్ధన, రాహేలు, మేరీ, సునీత, శేషరత్నం గీతాలాపన బాగున్నాయి.మెప్మా జిల్లా అర్బన్ సమాఖ్య అధ్యక్షులు జి. భారతి, ఏ ఓ దేవిడ్ వినీల్, టీఈ లు జయకుమార్, సంతోష్, సీఎం ఎం జి. కల్పనా గ్రీటింగ్స్ తెలిపారు. టీఈ బివి. ఫణికుమారి వందనసమర్పణ చేసారు. ఈ కార్యక్రమం లో జిల్లాలోని అందరు మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.






## నవీన్ కుటుంబాన్ని ఆదుకుంటాం

### ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, డిశంబర్ 18)

గత ఆగస్టు 26వ తేదీన ధాన్యం లారీ కూలీపనులకు వెళ్ళి భాకరాపేట ఘాట్ రోడ్డుపై ధాన్యం లారీ బోల్తా పడి అక్కడికక్కడే దుర్మరణం పాలైన కళత్తూరుకు చెందిన నవీన్ అనే కూలీ కుటుంబానికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వార సాయం అందించి ఆదుకుంటామని ఎంఎల్ఏ కోనేటి ఆది మూలం హామీ ఇచ్చారు. మంగళవారం వరదయ్యపాలెంకు విచ్చేసిన ఎంఎల్ఏ కోనేటి ఆదిమూలం గారిని 10టివి రిపోర్టర్, ప్రెస్ క్లబ్ ప్రచార కార్యదర్శి దొడ్డి శేఖర్ కలిసి ఈ విషయమై విన్నవించారు. భాకరపేట వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో కళత్తూరుకు చెందిన పలువురు కూలీలు గాయపడగా,నవీన్ అనే యువకుడు దుర్మరణం చెందినప్పటికీ ప్రభుత్వ పరంగా ఎటువంటి సాయం అందక పోవడంతో మృతుని భార్య ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారని వారి కుటుంబ పోషణ దుర్భరంగా మారిందని ఎంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణం స్పందించిన ఎంఎల్ఏ జరిగిన దుర్ఘటనపై చలించారు. ఇంతవరకు సాయం అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వార ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

# పేదలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలి

### ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులకు సూచించిన జిల్లా కలెక్టర్ ఒ ఆనంద్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

పేద ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు సంయుక్తంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ కోరారు. బుధవారం నెల్లూరు ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత నూతనంగా ఎంపికైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మడపర్తి శ్రీనివాసులు, వీర బ్రహ్మారెడ్డి, సయ్యద్ అబీదా సుల్తానా, దార్ల మల్లిఖార్జున్, మొగరాల సురేష్ తదితరులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశం తర్వాత ఆరోగ్యశ్రీ విభాగంలో మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. ఇందుకు కృషి చేసిన వైద్యులు, ఇతర సిబ్బందికి తన అభినందనలన్నారు. ఇదే స్ఫూర్తితో ఇతర అన్ని విభాగాల్లో మెరుగైన ఫలితాలు సాధించి, అంతిమంగా ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా పరిపాలనాపరమైన లోపాలను సరిదిద్దుకోకపోతే ఆసుపత్రి సూపరింటెండెంట్ పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అనుమతులిచ్చిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాల అధిపతులు పరస్పర అవగాహనతో ఆయా విభాగాల అవసరాల గురించి ప్రాధాన్యతా క్రమంలో జాబితా తయారు చేయాలన్నారు. అప్పుడే అనుమతులు ఇచ్చేందుకు కమిటీకు అవకాశం ఉంటుందన్నారు. ఫిజియోథెరపీ విభాగంలో అవసరమైన పరికరాలు, ఇతర సేవల గురించి వెంకటాచలంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ కాంపోజిట్ రీజినల్ సెంటర్( సి ఆర్ సి ) తో సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఓపి విభాగంలో రోగి ఆసుపత్రికి వచ్చినప్పటి నుండి తిరిగి ఆరోగ్యంగా వెళ్లునంత వరకు ప్రతి ప్రక్రియను ఆన్లైన్లో నమోదు చేసేందుకు "ఈ-హాస్పిటల్ " ను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇందుకు అవసరమైన మైక్రో ప్లానింగ్ ను వెంటనే తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయితే రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దాని ద్వారా ఆయుష్మాన్ భారత్ అభా ఐడి రిజిస్ట్రేషన్ లను పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎ సి ఎస్ ఆర్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వివి రాజ మన్నార్, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్ నాథ్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ విభాగాధిపతులు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్ భాషా, ఇతర వైద్యులు పాల్గొన్నారు.





# ఎన్డీఏ ప్రభుత్వంలో దేవాలయాల అభివృద్ధికి కృషి

## – రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

విభజన ఆంధ్ర ప్రదేశ్లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరులోని రంగనాయకులపేటలో దేవాదాయ సహాయక కమిషనర్ కార్యాలయాన్ని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర ఫరూక్ తో కలిసి నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, తాను దేవాదాయ శాఖ మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత దేవాలయాల అభివృద్ధికి తీవ్ర కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేవాలయాల మీద పూర్తి శ్రద్ధ చూపిస్తున్నారని ఆయన అన్నారు. నెల్లూరు నగరం కూడా ఆధ్యాత్మికంగా ఎదిగేందుకు తన వంతు కృషి చేస్తున్నామన్నారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేవాలయాలను నిర్వీర్యం చేశారని ఆయన అన్నారు. రాష్ట్రంలోని దేవాలయాల అన్నింటికీ పూర్తిస్థాయిలో కమిటీలు వేస్తున్నామని తెలిపారు. నెల్లూరు పట్టణంలో ఉన్న పురాతనమైన దేవాలయాన్ని మంత్రి నారాయణతో కలిసి పర్యటించి వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలో ఆధ్యాత్మికంగా ఎదగాలని తన కోరిక అన్నారు. ఇప్పటికే తాను మంత్రి పదవిగా అనేక దేవాలయాలను స్వయంగా తిరగటం జరిగిందన్నారు జరిగిందన్నారు. దేవాలయాల అభివృద్ధికి జిల్లా మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఇన్చార్జి మంత్రి ఫరూక్సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఇప్పుడు నిర్మించిన భవనంపైన త్వరలో పై అంతస్తు చేస్తామని తెలిపారు. తనకు దేవాదాయ మంత్రి బాధ్యతలు సీఎం తర్వాత రాష్ట్రంలోని అనేక దేవాలయాల అభివృద్ధికి ప్రణాళికలు శ్రీకారం చుట్టామన్నారు. అంత ముందు ధూప దైవాని ఎన్నో దేవాలయాలకు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కృషి చేశామన్నారు. త్వరలో వేద పండితులు ఖాళీలు రాష్ట్రంలో ఉన్నాయని భర్తీ చేస్తామనిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఆనం అరుణమ్మ, కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు, దేవాదాయ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా దేవాలయ అధికారులు, పాల్గొన్నారు. అంతకుముందు ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రులకు వేద పండితులు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. అనంతరం వచ్చిన మంత్రులను వేద పండితులు ఆశీర్వదించారు.





# శ్రీసిటీ-ఇసుజు ప్లాంట్ నుండి లక్షవ 'మేడ్ ఇన్ ఇండియా' వాహనం విడుదల

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)




శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమ (ఐఎంఐ) తమ ప్లాంట్ లో తయారైన 1,00,000వ (లక్షవ) 'మేడ్ ఇన్ ఇండియా'వాహనాన్ని విడుదల చేయడం ద్వారా మరో ముఖ్యమైన మైలురాయిని అధిగమించింది.దీనిని పురస్కరించుకుని బుధవారం పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్ యువరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ గ్రూప్ చైర్మన్ సాడో గౌరవ అతిథిలుగా పాల్గొన్నారు. శ్రీసిటీ ప్లాంట్లో 1,00,000వ వాహనం విడుదల పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఐఎంఐ ప్రెసిడెంట్ ఎండి రాజేష్ మిట్టల్. ఇది తమ సంస్థ నాణ్యత, నిబద్ధతకు నిదర్శనంగా వ్యాఖ్యానించారు. ఏపీ ప్రభుత్వం, శ్రీసిటీ ఎండీ అద్భుత సహకారానికి కృతజ్ఞతలు చెప్పిన ఆయన, నైపుణ్యం కలిగిన మానవ శక్తి, అధునాతన సాంకేతికత, అగ్రశ్రేణి పని ప్రక్రియల ద్వారా ఈ ఘనత సాధించామన్నారు. తమ సిబ్బందిని, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్కు చెందిన డిప్లొమా హోల్డర్ల ప్రతిభను ఆయన ప్రశంసించారు. భవిష్యత్తు లక్ష్యాల కోసం వారి కృషిని కొనసాగించాలని కోరారు. ఇసుజు మోటార్స్ ఇండియా టీమ్ను అభినందించిన డాక్టర్ యువరాజ్, భారతదేశ తయారీ నైపుణ్యం, ప్రపంచ పోటీతత్వానికి సాక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అభివర్ణించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి,రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి అభినందన సందేశాలను వినిపిస్తూ, ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆకర్షిస్తూ నూతన ఆవిష్కరణలు, ఉద్యోగ కల్పన,వృద్ధి సాధన దిశగా మంచి పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో ఆంధ్రప్రదేశ్ అంకిత భావాన్ని ఆయన హైలైట్ చేశారు.స్థానిక ప్రతిభను ప్రోత్సహిస్తున్న ఇసుజు యాజమాన్యాన్ని మరియు వెనుకబడిన ప్రాంతంలో పారిశ్రామిక నగరాన్ని ఏర్పాటు చేసి భారీ ఉపాధి అవకాశాలను, మహిళా సాధికారతను ప్రోత్సహిస్తున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి నాయకత్వాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమం శ్రీసిటీ-ఇసుజు భాగస్వామ్యానికి, ప్రపంచ స్థాయి పారిశ్రామిక హబ్గా శ్రీసిటీ పాత్రకు గర్వకారణంగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ను ఎంచుకున్న మొదటి ఆటోమొబైల్ తయారీదారు ఇసుజు, తనతో పాటు తన అనుబంధ పరిశ్రమలు మంచి వృద్ధి బాటలో నడిచేలా మార్గం సుగమం చేసిందన్నారు. ఇసుజు విజయం శ్రీసిటీలోని పెట్టుబడుల స్నేహపూర్వక పర్యావరణ వ్యవస్థకు అద్దం పడుతూ, ఇక్కడ పరిశ్రమలు మరింత ప్రమాణాలతో ముందుకు సాగేందుకు స్ఫూర్తి ఇస్తుందన్నారు. ఇసుజు ఇంజినీరింగ్ బిజినెస్ సెంటర్ ఇండియా చైర్మన్ సకామోటో మాట్లాడుతూ ఐఎంఐ వృద్ధి ప్రయాణాన్ని వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఇసుజు మోటార్స్ ప్రెసిడెంట్, సీఓఓ షిన్సుకే మినామి, మిత్సుబిషి కార్పొరేషన్ మొబిలిటీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ , గ్రూప్ సీఈఓ షిగేరు వాకబయాషి వర్చువల్గా పాల్గొని ప్రసంగిస్తూ ఇసుజు టీమ్ ని అభినందించారు. కాగా, 50 వేల యూనిట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో శ్రీసిటీ ప్లాంట్ ఇసుజు కార్యకలాపాలకు కీలకమైన కేంద్రంగా ఉద్భవించింది.దాని ఉత్పత్తి శ్రేణిలో క్యాబ్ మోడల్ భారతదేశంలోని వాణిజ్య విభాగంలో అత్యధికంగా అమ్ముడవుతున్న వాహనంగా నిలిచింది. ఇసుజు మొత్తం అమ్మకాలలో దేశీయ అమ్మకాలు 10-12% వాటా కలిగి ఉండగా, భారత్ నుండి తేలికపాటి వాణిజ్య వాహనాలను ఎగుమతి చేసే అతిపెద్ద సంస్థగా ఇసుజు మోటార్స్ నిలిచింది.1600 మంది ఉద్యోగులలో 22 శాతం మహిళలు ఉన్నారు. భారత వాణిజ్య వాహన పరిశ్రమలో ఇది అత్యధికం. కంపెనీలో 82 శాతం స్థానికంగా ఉపాధి అందిస్తోంది. ఉపాధిలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఉండగా, ఉద్యోగుల సరాసరి వయస్సు 22.4 సంవత్సరాలు కావడం విశేషం.

# జీన్స్ కార్నర్ రెడీమేడ్ షో రూమ్ను పునః ప్రారంభించిన షేక్ ఉస్మాన్ భాయ్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

నెల్లూరు నగరంలోని విఆర్సి సెంటర్ సమీపంలోని జీన్స్ కార్నర్ రెడీమేడ్ షోరూం ను మదీనా వాచ్ అధినేత షేక్ ఇంతియాజ్ కుమారుడు షేక్ ఉస్మాన్ భాయ్ చేతుల మీదుగా బుధవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉస్మాన్ బాయ్ మాట్లాడుతూ గడచిన పది సంవత్సరాలుగా అందరి మన్ననలను పొందిన జీన్స్ కార్నర్ అద్భుతమైన డిజైన్లతో రూపొందించి అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కేవలం 79 రూపాయలు నుంచి ఎవరు ఇవ్వలేని మంచి డిజైన్లతో కూడిన వస్త్రాలను ప్రజలకు అందించడం వారి ముఖ్య లక్ష్యం అన్నారు. ముఖ్యంగా స్టూడెంట్స్ కి ఇష్టమైన అన్ని రకాల డిజైన్లతో 99 రూపాయల నుంచి రెడీమేడ్ వస్త్రాలు అందించడం ఇంతవరకు నేను ఎక్కడ చూడలేదని తొలిసారిగా జీన్స్ కార్నర్ లో ఇటువంటి చూస్తున్నాను అని అన్నారు. చాలా తక్కువ ధరతో బ్రాండెడ్ వస్త్రాలు అందించడం చూస్తున్నానని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల ప్రజలకు




మంచి నాణ్యమైన వస్త్రాలు అందిస్తున్నారు. జీన్స్ కార్నర్ అధినేత హాజరత్ నాయుడు ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను అని తెలిపారు. ఈ షాపు లో స్టూడెంట్స్ కోసం స్టూడెంట్స కి కావాల్సిన ప్రతి ఒక్క వెరైటీ డిజైన్ నెరుగా ఫ్యాక్టరీ నుండీ మరియూ ఫ్యాక్టరీ ధర అనేది చాలా గొప్ప విషయము మీరు కూడా తప్పకుండా షాపు ను విసిట్ చేసి, సపోర్ట్ చేయాలని కోరారు. వీరు అందించిన ఈ డిజైన్లు, ఈ ఆఫర్లు వేరే ఏ షాపులో అయినా మీరు చూపిస్తే మీకు ఒక ఛాలెంజ్ మీరు చూయించలేరు అని వారు తెలిపారు. కావున ప్రతి ఒక్క కస్టమర్లు, ప్రతి ఒక్క స్టూడెంట్ ముఖ్యంగా ఈ ఆఫర్ ను వినియోగించుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇలియాజ్, షేక్ ఉస్మాన్, షేక్ షాబు, హాజీ షేక్, తదితరులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# ఇద్దరు కిషోర ప్రాయ బాలలకు విముక్తి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)

వెట్టి చాకిరీ (బాండెడ్ లేబర్) రహిత, బాల కార్మిక రహిత ప్రకాశం జిల్లా ఆవిర్భావమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఇద్దరు కిషోరప్రాయ బాలలకు విముక్తి కల్పించింది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చి ఒంగోలు సమీపంలోని కరవదిలో ఉన్న కళ్యాణ్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో వెట్టి చాకిరీ చేస్తున్న వీరిని విడిపించి, స్వస్థలానికి పంపించేందుకు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చర్యలు తీసుకున్నారు. పనిచేసిన కాలానికి చట్ట ప్రకారం రావలసిన డబ్బులను కూడా సంబంధిత పరిశ్రమ నుంచి వీరికి ఇప్పించారు. 2014 తరువాత రాష్ట్రంలోనే ప్రథమంగా ప్రకాశం జిల్లాస్థాయి బాండెడ్ లేబర్ విజిలెన్స్ కమిటీ ఇటీవల ఏర్పడ్డాక ఈ కోణంలో వచ్చిన తొలి ఫిర్యాదుపై కొన్ని గంటల వ్యవధిలోనే వేగంగా స్పందించి బాధితులను విడిపించేలా సమన్వయంతో పని చేసిన అధికారులను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అభినందించారు. ఈ ఆపరేషనుకు సంబంధించి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ లోని దిండోరి జిల్లా నుంచి ఎనిమిది మంది కళ్యాణ్ ఆక్వా పరిశ్రమలో పని కోసం వచ్చారు. వచ్చిన కొన్ని రోజులకే నలుగురు తిరిగి వెళ్ళిపోయారు. అనంతరం మరో ఇద్దరు కూడా ఇక్కడ పనిచేయలేక వారి స్వస్థలాలకు తిరిగి వెళ్ళిపోయారు. ఈ నేపథ్యంలో మిగిలిన ఇద్దరు కూడా వెళ్ళిపోతారేమోనన్న ఉద్దేశంతో వారి వద్ద ఉన్న మొబైల్స్ ను సంబంధిత పరిశ్రమ నిర్వాహకులు తీసేసుకున్నారు. ఈ ఇద్దరికీ టెలిఫోన్ సదుపాయం లేకుండా చేయడంతో పాటు రెండున్నర నెలల పని కాలానికి ఇవ్వవలసిన డబ్బులను కూడా చెల్లించలేదు. మరోవైపు స్వస్థలాలకు వెళ్లిన వారు ఇక్కడ ఉన్న ఇద్దరి గురించి, తాము ఎదుర్కొన్న పరిస్థితుల గురించి సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు ప్రకాశం జిల్లా కలెక్టరుకు ఈ విషయాన్ని తెలియజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా బాధితులను విడిపించే ఆపరేషన్ చేపట్టాలని ఒంగోలు ఆర్డిఓ కె లక్ష్మీ ప్రసన్నను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు, కార్మికశాఖ అధికారులతో ఆర్డిఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ దుర్గాభవానీ, ఒంగోలు లేబర్ ఆఫీసర్ ఎలిజబెత్తమ్మలతో సమన్వయం చేసుకుంటూ, సార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీల్ కుమార్, ఇతర ఎన్.జి.ఓ.ల సహకారంతో ఈ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఆక్వా పరిశ్రమలో వెట్టి చాకిరీ చేస్తున్న ఒక బాలుడు, ఒక బాలికను వీరు విడిపించారు. బుధవారం మధ్యాహ్నం ఈ ఇద్దరికీ ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ రిలీఫ్ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోతోపాటు ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి ప్రియాంక, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. బాధితులు తమ స్వస్థలాలకు వెళ్లేలా, ఆక్వా పరిశ్రమపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా పర్యవేక్షించాలని ఈ సందర్భంగా ఆర్డీవోకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. వెట్టి చాకిరీ చేస్తున్న విషయం తెలిసిన ఒక్క రోజులోనే, కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే బాధితులను విడిపించేలా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టరుకు, అధికార యంత్రాంగానికి మధ్యప్రదేశ్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.





# వ్యవసాయ రంగంలో సమస్యలకు పరిష్కర మార్గాలు కనిపెట్టాలి






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 18)

విజయవాడ మేరీస్ స్టేల్లా వ్యవ సాయ కళాశాలలో బుధవారం హార్టికల్చర్ ఎక్సపో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉలవపాడు రైతు స్ఫూర్తి ఫార్మర్ ప్రోడ్యుసర్ కంపెని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వై బాలచంద్రను ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలచంద్ర మాట్లాడుతూ విద్యార్థులుకు వ్యవసాయ రంగం లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు అధునాతన విధానాలను విద్యార్ది దశ నుండి పరిష్కర మార్గాలను కనిపెట్టి రైతులను ముందుకు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులు కు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగినది ఈ మీటింగు లో విజయవాడ లోని ఆంధ్ర లయోలా కళాశాల జియంజి కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భం లో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆ పంట లకు వ్యాల్యుఎడిషన్ చేయుట ద్వారా నిల్వ సామర్థ్యం పెంచి అధిక ధరలు వచ్చేలాఎలా చేయాలో విద్యార్థులుకు వివరించుట జరిగింది. ఈ కార్యక్రామంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జెసింత క్వాడ్రస్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ లక్ష్మణ స్వామి, సమునతి అగ్రి రిలేషన్ షిప్ శీలం మల్లికార్జునరావు, యువ పారిశ్రామికవేత్త వై ఎస్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.


# టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న నేతలు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

నెల్లూరు డిసెంబరు 18 కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గొల్లపల్లి గ్రామానికి చెందిన, గొల్లపల్లి 24 ఎల్ కాలువ అధ్యక్షులు ఉడతా హజరతయ్య, కొట్టాలు గ్రామానికి చెందిన గుత్తా శ్రీధర్ నాయుడు, ఓబులాయపల్లి గ్రామానికి చెందిన నలుబోతు శివకృష్ణలు కలిసి నెల్లూరు సంతపేటలో తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు ప్రణాళికలు నచ్చి శాశ్వత సభ్యత్వం తీసుకున్నామని పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ గ్రామంలోని మండలంలోని ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు.

# ఉత్తమ ప్రతిభకు మర్రిపూడి ఎస్ఐకి ప్రశంసా పత్రం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)

జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు మర్రిపూడి ఎస్ఐ టి రమేష్ బాబు. కేసులను సకాలంలో నమోదు చేయించటం, కేసులను చేధించడంలో చేసిన కృషికి ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం పొందారు.

## దుప్పట్లు పంపిణీ చేసిన ఎస్ఐ





(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 18)

కంభం పట్టణంలోని గాయత్రి నవోదయ కోచింగ్ సెంటర్ ఆవరణలో బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షులు యోబు ఆధ్వర్యంలో కందులాపురం పంచాయతీ సిబ్బంది, శానిటైజర్ సిబ్బందికి ఎస్ఐ నరసింహారావు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



యోబు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని గుర్తు చేసుకుంటూ బుధవారం ఈ కార్యక్రమం చేపట్టామని అంబేద్కర్ ఆశయాలు ఆలోచనలు మనందరికీ ఎంతో స్ఫూర్తినిస్తాయని అలాంటి గొప్ప వ్యక్తి శ్రమ వల్లనే మనకు ఈరోజు రాజ్యాంగం అంటే ఏమిటో పూర్తిగా తెలిసిందని తెలిపారు. అలాగే ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ అత్తర్ హుస్సేన్ (దాదా) మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది, శానిటైజర్ సిబ్బంది సేవలు ఎన్నటికీ మరిచిపోలేమని కరోనా సమయంలో వాళ్ల ప్రాణాలను లెక్కచేయకుండా వాళ్లు అందించిన సేవలు అభినందనీయమని అలాంటి వాళ్ళని గుర్తు చేసుకుని ఈ కార్యక్రమం చేపట్టిన యోబును అభినందించారు. ఈ సందర్భంగా కంభం ఎస్ఐ నరసింహారావు అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ గురించి చెప్పాలంటే ఒక్క రోజులో చెప్పలేమని ఎన్ని రోజులు చెప్పినా సరిపోదని ఆయన పేదరికంలో పుట్టినా తెలివితేటలలో ఆయనకు ఎవరూ సాటిరారు అని అంబేద్కర్ ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని ఆయన కోసం ఎంతో ఉన్నత చదువులు చదుకున్న వాళు ్ళ,పెద్ద పెద్ద మేధావులు ఆయన సలహా కోసం ఎదురు చూసేవారని పేదరికం చదువుకి అడ్డు కాదు అనేది ఆయన భావన అని. కానీ ఈరోజు కేవలం పేదరికం అని మీ పిల్లల్ని చదివించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అందరూ పేదరికం అని చదువులు ఆపివేస్తే గొప్ప గొప్ప మేధావులు వచ్చేవాళ్ళు కాదని పేదరికాన్ని పక్కనబెట్టి ఆరోజు చదువుకోవడం వలనే రాజ్యాంగాన్ని రచించే ఒక గొప్ప వ్యక్తిగా ఆయన మనమధ్య లేకపోయినా మనం ఆయనను గుర్తుచేసుకుంటున్నామని, మీరు కూడా మీ పిల్లల్ని చదివించి మంచి పౌరులుగా తీర్చిదిద్దే భాధ్యత మీపై ఉందని ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించిన యోబు ను అభినందించి సిబ్బందికి దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి నవోదయ కోచింగ్ సెంటర్ ఉపాధ్యాయులు, డిష్ మున్నా, తదితరులు పాల్గొన్నారు.

## టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుల ఎంపిక కమిటీకి చైర్మన్‌గా నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిశంబర్ 18)

నెల్లూరు జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సిండియా ఎంపికచేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో పాటూ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి ప్రతిభావంతులైన సభ్యులను టెలికం అడ్వైజరీ కమిటీగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు గుర్రం మాల్యాద్రి (వలేటివారిపాలెం, కందుకూరు నియోజకవర్గం), కటారి రమణయ్య (మర్రిపూడి, ఆత్మకూరు నియోజకవర్గం), బొప్పూరు ప్రసాద్ (శ్రీహరినగర్, నెల్లూరు రూరల్), కుట్టుబోయిన బ్రహ్మానందం (కావలి నియోజకవర్గం), ఏటూరి రమేష్ బాబు (నెల్లూరు సిటీ), ముంగర గోపాల్ (ఇందుకూరుపేట, కోవూరు నియోజకవర్గం), తాటికొండ అనూష (కొండాపురం, ఉదయగిరి నియోజకవర్గం), వేదనపర్తి సురేంద్రరెడ్డి (నెల్లూరు రూరల్) ఉన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవిన్యూ గ్రామ సభలు

తహసీల్దార్ జ్వాలా నరసింహారావు





(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, డిశంబర్ 18)

గ్రామీణ ప్రజలకు భూ సమస్యలు పరిష్కరించెందుకే రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రెవిన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయి అని తహసీల్దార్ జ్వాలా నరసింహారావు అన్నారు. బుధువారం మండలంలోని జువ్విగుంట గ్రామంలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంబాబు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాలొగొన్నారు.

## సీఎంఆర్ జ్యువెల్లరి వారిచే బహుమతులు అందజేత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)

ఏ.పి.ఎస్.ఆర్.టి.సి., ఒంగోలు వారు పల్లెవెలుగు సర్వీసుల నందు ప్రయాణించు వారికి ప్రోత్సాహకముగా పొందూరు, తాళ్ళూరు, గుండాయపాలెం, కొణిజేడు రూట్ల నందు గిఫ్ట్ స్కీమ్‌ను అమలు పరచడం జరిగినది. గిఫ్ట్ స్కీమ్ డ్రా ప్రతి 15 రోజులకు ఒకమారు డ్రా తీసి డ్రా లో గెలుపొందిన వారికి సీఎంఆర్ జ్యువెల్లరి వారిచే బహుమతులు అందజేయబడుతుందన్నారు. అందులో భాగంగా తేది:18.12.2024న సాయంత్రం డి శ్రీనివాసులు, డిపో మేనేజరు, ఆర్ఎం నాయక్, సూపరింటెండెంట్(ట్రాఫిక్), కె. నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ (ఎఫ్), వై.ప్రభాకర్ (టిఐ-3), పి.ఎస్.ఎస్.రావు , డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), వై. హనుమంతరావు, కంట్రోలర్, సిఎంఆర్ జువెలరీ అధినేత మావూరి శ్రీనివాసరావు అధ్వర్యంలో డ్రా తీయడమైనది. ఈ డ్రాలో క్రింద తెలిపిన వారు బహుమతులు గెలుపొందారు. విజేతలు డిపో మేనేజరు కార్యాలయం నందు సంప్రదించి బహుమతులు పొందాలన్నారు. తాళ్ళూరు మలిపెద్ది ఆదిశేషమ్మ, తెల్లబాడు, మొబైల్ నెం 9652327027, కొణిజేడు పొందూరు, జి ఇబ్రహీం, ఇసంపేట, ఒంగోలు, మొబైల్ నెం.7702688083, గుండాయయపాలెం కె రవికుమార్, మొబైల్ నం.9949236126.

## ప్రతి గ్రామంలో పశుగ్రాసం పల్లె రైతులకు వరం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిశంబర్ 18)

పాడి రైతులకు ఆదుకోవాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పశుగ్రాసం సాగుకు పెద్దపీట వేస్తుంది.ఉపాధి హామీ పథకం కింద బహు వార్షిక పశుగ్రాసాల సాగు పథకాన్ని అమలు చేస్తుంది. 100% రాయితో ఒక్కో రైతు వ్యక్తిగతంగా కనిష్టంగా 10 సెంట్లు నుంచి గరిష్టంగా 50 సెంట్లు విస్తీర్ణంలో పశుగ్రాసం పెంచేందుకు ప్రోత్సాహం కల్పిస్తుంది.

**అర్హులు సద్వినియోగం చేసుకోవాలి**

ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన ఎస్సీ,ఎస్టీ, సన్న, చిన్నకా రైతులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కార్డు కలిగి ఉంటే పశుగ్రాసం త్రాగు చేసుకునే అవకాశం ఉందని మార్కాపురం పశుసంవర్ధక శాఖ అధికారి బాలునాయకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు స్థానిక రైతు సేవా కేంద్రం లేదా సమీపంలోని పశుసంవర్ధక శాఖ వైద్య శాఖలో వైద్య అధికారి ని సంప్రదించి దరఖాస్తులు చేసుకోవచ్చు అని అన్నారు. ఉపాధి హామీ కార్డు,ఆధార్ కార్డు, 1బి, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్ కార్డు జిరాక్స్ పత్రాలను దరఖాస్తులు జత చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం నీటి వసతి కలిగిన భూమిని ఎంపిక చేసి గ్రామ సభల ద్వారా రైతుల జాబితాలను కలెక్టర్ ఆమోదిస్తారని అన్నారు. పశుగ్రాసం పెంపొందించేందుకు అనువైన భూమిని ఎంపిక చేసి దాన్ని పెంచేలా అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తారు అని తెలిపారు.





## ఆ గిరిజన కాలనీలో మొట్టమొదటి పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థి

(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, డిశంబర్ 18)

భారతదేశానికి స్వతంత్రం వచ్చి 77వ సంవత్సరము జరుగుచున్న చరిత్రలో సింగరాయకొండ మండలం, శానంపూడి గిరిజన కాలనీ చెందిన మానికల నరసింహం మొట్టమొదటిగా పదవ తరగతి పాస్ అయ్యి, మధ్యలోనే బడి మానివేస్తున్న గిరిజన చిన్నారులకు ఆదర్శంగా నిలిచాడు.ఈ నేపథ్యంలో శానంపూడి గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి తొట్టెంపూడి సుబ్బానాయుడు తన తాతయ్య అయిన తొట్టెంపూడి అంకయ్య వర్ధంతి సందర్భంగా మానికల నరసింహం యొక్క విద్యను ప్రోత్సహించుటకు ఎస్ఐ మహేంద్ర చేతుల మీదుగా 5000 రూపాయల నగదును బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఎన్ని విద్యా అవకాశాలు కల్పించినను వాటిని అందుకోవటంలో వెనకబడిఉన్నారని,భారత రాజ్యాంగం ద్వారా వచ్చిన రిజర్వేషన్లు ,బ్యాక్ లాగ్ పోస్టులను వినియోగించుకొని సామాజికంగా ఆర్థికంగా ముందుకు పోవాలన్నారు.కష్టపడి బాగా చదివి ఉన్నత స్థాయికి పోయి, మధ్యలో బడి మానివేస్తున్న విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని నరసింహాకు చెప్పారు. హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ మానికల నరసింహం యొక్క తండ్రి కృష్ణ ఇటీవలే మరణించిననూ పట్టు విడవకుండా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారని, తల్లి కష్టార్జితం మీద చదువుచున్న ఈ గిరిజన పుత్రునికి, అడిగిన వెంటనే విద్యాపరమైన సహకారం అందించుటకు ముందుకు వచ్చిన దాత సుబ్బా నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తలసేమియా చిన్నారులకు మరో జన్మ అందిస్తున్న రెడ్‌క్రాస్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

నెల్లూరు రెడ్ క్రాస్ జిల్లా కార్యాలయంలో తల సేమియా వ్యాధి బాధిత చిన్నారులకు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్సలు చేసేందుకు సంబంధించి హెచ్ఎల్ఏ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంకల్ప్ ఫౌండేషన్ ఫౌండేషన్ మేనేజర్ అభిజిత్, వైద్యులు మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 13 ప్రాజెక్టులు నిర్వహిస్తున్నాం. అందులో తల సేమియా ప్రాజెక్టు కూడా ఒకటని, ఈ ప్రాజెక్టు ద్వారా తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి, సేవలలో భాగంగా ఏడాదికి 1500 యూనిట్ల రక్తాన్ని, రెడ్ క్రాస్ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. అయితే తల సేమియా బాధిత చిన్నారులు వారి వైకల్యాన్ని అధిగమించి, అందరూ చిన్నారుల్లా, సాధారణ జీవితం గడపాలనే ఉద్దేశంతో సంకల్ప ఫౌండేషన్ సహకారంతో రెడ్‌క్రాస్ ద్వారా వారికి 25 నుంచి 40 లక్షల రూపాయలు ఖర్చుయ్యే బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స ను ఉచితంగా చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఎనిమిది మంది చిన్నారులకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లంటేషన్ చికిత్సను విజయవంతంగా నిర్వహించి వారికి రెడ్ క్రాస్ వారికి మరో జన్మను ప్రసాదించడం జరిగినది. మరో 15 మంది చిన్నారులకు ఈ బోన్‌మ్యారో చికిత్స అందించేందుకు.. ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు. తాజాగా ఇందుకు సంబందించి మరో 17 మందికి బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స అందించేందుకు సంకల్ప ఫౌండేషన్ వారి నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు బోన్ మ్యారో చికిత్సలు అందించేందుకు వైద్యులు సీత, కో కన్వీనర్ పర్వీన్ ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. త్వరలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 20 పడకల తల సేమియా క్లినిక్ ని అందుబాటులోకి తీసుకొచ్చి..మరింత ఎక్కువమందికి ఈ బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స చేయించడం జరుగుతుంది తెలిపారు. అనంతరం వచ్చినటువంటి తల సేమియా చిన్నారులకు వారి తల్లిదండ్రులకు మహా యాగ హెల్పింగ్ సొసైటీ వారు భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ స్టేట్ మెనిజింగ్ కమిటీ సభ్యులు, డాకారపు రవి ప్రకాష్, రెడ్ క్రాస్ ట్రెజరర్ సురేష్ కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు నేతాజీ సుబ్బారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, వాకాటి విజయ కుమార్‌రెడ్డి, తలసేమియా కన్వినర్ డాక్టర్ సీత, అడ్వైసర్ డాక్టర్ హరిత, కొకన్వీనర్లు ఎస్కే పర్వీన్, యన్ బలరామయ్య నాయుడు, సెక్రెటరీ పి మస్తానయ్య, రెడ్‌క్రాస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.









# నెల్లూరు జిల్లాలో రహదారుల అభివృద్ధికి సహకరించండి



- కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖమంత్రి
- నితిన్ గడ్కరీకి ఎంపీ వేమిరెడ్డి వినతులు
- కావలి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయండి
- దుత్తలూరు- కావలి రోడ్డు పనుల్లో వేగం పెరిగేలా అధికారులను ఆదేశించండి
- రాజుపాలెం నుంచి రామాయపట్నం పోర్టు వరకు రహదారిని అభివృద్ధ చేయండి
- ఎంపీ వేమిరెడ్డి వినతులపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి
- కావలి బైపాస్ రోడ్డుకు ఓకే
- దుత్తలూరు-కావలి రోడ్ల పనులు వేగవంతం అయ్యేలా చర్యలు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

నెల్లూరు జిల్లాలో రహదారుల అభివృద్ధే ధ్యేయంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి చేస్తున్నారు. జిల్లాలో రహదారులకు సంబంధించి పలు అంశాలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని వినతి సమర్పించారు. ఎంపీ వేమిరెడ్డి వినతులపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి. రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**కావలి పట్టణం పశ్చిమం వైపు బైపాస్ ఏర్పాటు చేయండి..**

కావలి నియోజకవర్గం కావలి మండలంలో 2 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారన్నారు. సమీప మండలాల్లో మరో 3 లక్షల జనాభా నివసిస్తున్నారని ఎంపీ వేమిరెడ్డి కేంద్రమంత్రికి వివరించారు. ప్రజలు తమ వివిధ అవసరాల నిమిత్తం కావలి పట్టణానికి వస్తుంటారని, దాంతో పాటు కావలి టౌన్ గుండా భారీ వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయన్నారు. దాంతో టౌన్‌లో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో స్థానిక ప్రజలు, టౌన్‌కు వచ్చే సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఎన్‌హెచ్-16 నుండి కావలి-దుత్తలూరు రహదారిని ఎన్‌హెచ్ 167 బిజి వద్ద అనుసంధానిస్తూ కావలి టౌన్‌కి పశ్చిమాన ఒక బైపాస్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ వేమిరెడ్డి వినతిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. కావలి టౌన్ పశ్చిమాన బైపాస్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**కావలి- దుత్తలూరు రోడ్డు పనులు వేగవంతం చేయండి..**

అలాగే దుత్తలూరు (ఎన్‌హెచ్-167 బిజి జంక్షన్ వద్ద) నుండి కావలి వద్ద ఎన్‌హెచ్-16లో కలిపేలా నిర్మిస్తున్న రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్‌హెచ్-167 బిజి కి 101 కి.మీ పశ్చిమం వైపున కావలి పట్టణం ఎంట్రన్స్ నుండి ఎన్‌హెచ్ -167 బిజిలో కొనసాగుతున్న పనిలో డ్రైన్ నుండి డ్రెయిన్ వరకు తప్పనిసరిగా సిసి పేపర్ వేయించాలని కోరారు. దీనివల్ల ప్రజలకు అసౌకర్యం తగ్గి ప్రమాదాలు నివారించే వీలుంటుందని వివరించారు. కాబట్టి రహదారి పనులను వేగవంతం చేసేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డ్రెయిన్ టు డ్రెయిన్ వరకు సిసి పేపర్‌ను అందించే పనిని మంజూరు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి తప్పకుండా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

**రామాయపట్నం పోర్టుకు రహదారిని విస్తరించండి..**

జిల్లాలో రాజుపాలెం నుంచి అల్లూరు మీదుగా రామాయపట్నం ఓడరేవు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మీదుగా ఎన్‌హెచ్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బి రహదారిని ఎన్‌హెచ్ వరకు సిఆర్ఐఎఫ్ కింద అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రమంత్రికి ఎంపీ వేమిరెడ్డి విన్నవించారు. ఈ రహదారి ఏర్పడితే రామాయపట్నం ఓడరేవు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి ఎన్‌హెచ్ 16కి లాజిస్టిక్ ఎగుమతులు సులభతరం అవుతాయని వివరించారు. అలాగే జిల్లా తీరప్రాంత గ్రామాలలో నివసించే మత్స్యకారులకు రవాణా సౌకర్యం మెరుగుపడి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయమై స్పందించిన కేంద్రమంత్రి.. రహదారి విస్తరణపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఆది ఆంధ్ర పాలెంలో పొలం పిలుస్తుంది

**కందుకూరు వ్యవసాయ సంచాలకులు పి అనసూయ, మండల వ్యవసాయ అధికారిణి బి తిరుమల జ్యోతి**





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 18)

ఆత్మకూరు రైతు సేవ కేంద్రం పరిధిలోని ఆది ఆంధ్రపాలెంలో బుధవారం వ్యవసాయ అధికారిణి బి తిరుమల జ్యోతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరి పొలాన్ని సందర్శించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వాతావరణంలో వస్తున్నటువంటి మార్పుకు అనుగుణంగా వరిలో ఆకు ముడత గమనించుట జరిగినది. దీనికి కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరానికి పిచికారి చేయవలసిందిగా రైతులకు తెలియజేయడం జరిగినది. మరియు వాతావరణం, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తక్కువగా ఉండటం వలన అగ్గి తెగులు సోకే సూచనలు ఉండటచేత నూలి కండి ఆకారంలో మచ్చలు కనబడినచో రైతులు వెనువెంటనే ట్రై సైక్లో జోన్ భీమ్ పొడి 120 గ్రాములు ఎకరాకు పిచ్చిగారి చేయవలసిందిగా తెలిపారు. ఉధృతి ఎక్కువగా ఉన్నచో ఐ సో ప్రోథయోలీన్ 300 మి మిల్లీలు ఎకరాకు పిచికారి చేయవలసిందిగా కోరారు. ఆకు ఎండు తెగులు గమనించినచో రైతులు ప్లాంటుమైసిన్ ఒక గ్రామం మరియు కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. కాండం కుళ్ళు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు అయితే ట్రై ప్రాక్సిస్ స్ట్రోబిన్‌టెబుకోనసోల్ (నాటివో)80- 100 గ్రాములు ఎకరాకి పిచికారీ చేయాలి అని రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమానికి కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు అనసూయ, మండల వ్యవసాయ అధికారి తిరుమల జ్యోతి, గ్రామ వ్యవసాయ సహాయకులు షరీఫుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

జికా వైరస్ లక్షణాలు గల బాలుడికి మెరుగైన చికిత్స

## వైద్యబృందాలతో వెంకటాపురంలో పరీక్షలు మంత్రి ఆనం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామంలో ఒక బాలుడికి జికా వైరస్ లక్షణాలు బయటపడడంతో ఆ బాలుడికి వైద్యపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, మెరుగైన వైద్యచికిత్స కోసం చెన్నైలోని సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు తరలించినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. వెంకటాపురం గ్రామంలో ప్రముఖ వైద్యులతో కూడిన బృందాలతో సర్వే చేపట్టి పరీక్షలు చేపడుతున్నామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేసినట్లు మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు దేశ్‌నాయక్, ఎంవి రమణారెడ్డి, బివి రమణారెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండకు అభినందనలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)



ప్రముఖ రచయిత, సాహితీవేత్త అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఆయనకు పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు. ఆయన రాసిన"దీపిక" అభ్యుదయ వ్యాస సంపుటి'కి గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించడం చాలా సంతోషంగా ఉందని కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెనుగొండ లక్ష్మీనారాయణ గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తూనే,1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించి, 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారని, 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారని,వారి తొలి గ్రంథం “అనేక” 2004 లో ప్రచురితం కాగా, విదిత 2014 ప్రచురితమయిందని వివరించారు .దీపిక ను 2021లో ప్రచురించారని తెలిపారు. పెనుగొండ వారు తెలుగు సాహిత్యానికి చేసిన కృషికి గాను గతంలో అజో విభో కందాళం వారి 'జీవన సాఫల్య పురస్కారాన్ని , అధికార భాషా సంఘం వారి తెలుగు భాషా పురస్కారాన్ని (2003)లో, ప్రజాకవి సుంకర సత్యనారాయణ స్మారక పురస్కారాన్ని (2003) అందుకున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనకు నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, మిడసల మల్లికార్జునరావు, యువి రత్నం, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, యువ కవయిత్రి బీరం అరుణ, మహతి తన్నీరు బాలాజీ, కె బాలకోటయ్య, ఓరుగంటి ప్రసాద్, తదితరులు అభినందనలు తెలియజేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో రైతుల నైపుణ్యాభివృద్ధి పథకాల పై మాగుంట ప్రశ్న



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)

దేశం ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ , ప్రకాశం జిల్లాలో రైతుల నైపుణ్యాభివృద్ధికి అమలుచేయుచున్న పథకాలు, లబ్ధిదారులు, నిధుల కేటాయింపు, చేసిన ఖర్చు, అవగాహన పెంపుకు ప్రచార కార్యక్రమాల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయక మంత్రి రాంనాథ్ ఠాకూర్ సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లాలో రైతులకు, వ్యవసాయ మహిళలకు, యువతకు నూతన వ్యవసాయ సాంకేతికలు అందించి ఆర్థికంగా ఎదుగుటకు పలు కార్యక్రమాల ద్వారా శిక్షణా తరగతులు, ప్రదర్శనలు, సందర్శనల ఏర్పాటుకు పలు పథకాలు, కార్యక్రమాలను కేద్రం అమలుచేయుచున్నదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 2019-20 నుండి 2023-24 వరకు కేంద్రం వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ కార్యక్రమం క్రింద రూ.41.61 కోట్ల వ్యయంతో 5,74,817 మందికి, కృషి విజ్ఞాన్ కేంద్ర కార్యక్రమం క్రింద 2,35,514 మందికి, గ్రామీణ యువత నైపుణ్య శిక్షణ కార్యక్రమం క్రింద రూ.55.38 కోట్లతో 2,316 మందికి, వ్యవసాయ యాంత్రీకరణ మిషన్ కార్యక్రమం క్రింద రూ.7,398.74 కోట్లతో 11,042 మందికి, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కార్యక్రమం క్రింద 165 మందికి, పియం కౌశల్ వికాస్ యోజన కార్యక్రమం క్రింద 4,515 మందికి, జాతీయ గ్రామీణ నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపకత క్రింద 97 మందికి, కృషి సఖిస్ కార్యక్రమం క్రింద 1,927 మంది రైతులకు శిక్షణ, నైపుణ్య శిక్షణ ఇవ్వబడిందని తెలిపారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి పియం కౌశల్ వికాస్ యోజన కార్యక్రమం క్రింద 645 మందికి శిక్షణ, కృషి సఖిస్ కార్యక్రమం క్రింద 94 మందికి శిక్షణ ఇవ్వబడిందని, జాతీయ గ్రామీణ నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపకత క్రింద 6 మందికి డ్రోన్ల శిక్షణ ఇవ్వబడిందని కేంద్ర మంత్రి తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



(షణ్ముఖ వెలుగు, ఆత్మకూరు, డిశంబర్ 18)

ఆత్మకూరు నియోజకవర్గం ఆత్మకూరు, చేజర్ల మండలాల్లో పలువురు వైఎస్సార్సీపీ నాయకులను బుధవారం ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పరామర్శించారు. చేజర్ల మండలం గాలిపాళెం గ్రామంలో పోలంరెడ్డి పుల్లారెడ్డి కుమారుడు పోలంరెడ్డి విజయశంఖర్ రెడ్డి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి పరామర్శించారు. ఆయన వెంట మండల వైఎస్సార్సీపీ నాయకులు ఉన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు వైఎస్సార్సీపీ నాయకులు సయ్యద్ జమీర్ బాష, కౌన్సిలర్ నౌషాద్ బేగంల కుమారుడు జహీర్ అనారోగ్యానికి గురై ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండడంతో వారిని విక్రమ్ రెడ్డి పరామర్శించారు. జహీర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులకు జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్సీపీ నాయకులు ఉన్నారు.

## ఉపాధి హామీ మండల స్థాయి సమావేశం




(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, డిశంబర్ 18)

మండలంలో బుధవారం ఈజీఎస్‌కు సంబంధించిన మండల స్థాయి సమావేశం జరిగింది. సదరు సమావేశం నందు లేబర్ బడ్జెట్, ఫారం పౌండ్స్, క్యాటిల్ షెడ్స్ పై రివ్యూ చేయడం జరిగింది. ఈ సమావేశం నందు ఎంపీడీవో రంగ సుబ్బరాయుడు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగింది. ప్రజలు తమ సమస్యల అర్జీలను స్వీకరించిన జనసేన నాయకులు అధికారులతో కూటమి నాయకులతో పరిష్కార మార్గాలను చూపే ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ కూడా సద్వినియోగకోవాల్సిందిగా జనసేన నాయకుల తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కిషోర్ గునుకుల, కృష్ణారెడ్డి, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు విజయవంతం



## అన్ని సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం
## అన్నదాతలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు
## మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

జిల్లాలో సాగునీటి సలహా సంఘాల ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో కలిసి సాగునీటి సంఘాల ఎన్నికల విజయవంతంపై ఆత్మకూరు నియోజకవర్గ సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో సాగునీటి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించామని, జిల్లా వ్యాప్తంగా అన్ని సాగునీటి సంఘాలు ఏకగ్రీవమైనట్లు మంత్రి చెప్పారు. రైతులంతా ఏకపక్షంగా ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పక్షాన నిలిచారని, తమ ప్రభుత్వం పట్ల అపూర్వ విశ్వాసం, ప్రగాఢ నమ్మకం చూపిన రైతన్నలకు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికైన సభ్యులందరూ ఐకమత్యంగా వ్యవసాయపనులకు సాగునీటిని వినియోగించుకోవాలి మంత్రి ఆనం పిలుపునిచ్చారు. జిల్లాలో 3649 సాగునీటి సంఘాలకు నోటీఫికేషన్ ఇవ్వగా 3553 సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయన్న మంత్రి, మిగిలిన ఖాళీలను కూడా ఆసక్తి గల రైతులతో కలెక్టర్ ఆధ్వర్యంలో నామినేటెడ్ చేస్తామని చెప్పారు. అలాగే సోమశిల, పెన్నాడెల్టా, కనుపూరు కాలువ, గండిపాలెం, రాళ్లపాడు, వి.ఆర్.కోట ప్రాజెక్టు కమిటీలకు ఈనెల 21న అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎంపిక చేస్తామని మంత్రి చెప్పారు. ఈ ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వ సమర్థ పాలనాదక్షతకు నిదర్శనంగా మంత్రి పేర్కొన్నారు. ఐదేళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత రైతుల భూములు పచ్చతోరణంతో కళకళలాడనున్నాయని, చివరి ఆయకట్టు వరకు సాగునీటని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పంగా మంత్రి చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 74 నీటి సంఘాలకు 74 మంది అధ్యక్షులు, 74 మంది ఉపాధ్యక్షులు ఎన్నికైనట్లు మంత్రి చెప్పారు. మిగిలిన ఖాళీలను కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో నామినేటెడ్ చేస్తామన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలపై ప్రతిపక్షం ఆరోపణలు అర్ధరహితమన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించే ధైర్యం కూడా చేయలేదని మంత్రి మండిపడ్డారు. రైతుల పట్ల గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. సోమశిల ప్రాజెక్ట్ దెబ్బతినడానికి కారణం గత ప్రభుత్వమేనన్నారు. కనీసం మరమ్మతు పనులకు కూడా నిధులు విడుదల చేయలేదన్నారు. అన్నమయ్య ప్రాజెక్ట్ గేట్ల గ్రీసు కోసం రూ. 7 కోట్లు అడిగితే పైసా ఇవ్వలేదన్నారు. ఫలితంగా అన్నమయ్య ప్రాజెక్ట్ తెగిపోయిందన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్స్ పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో సోమశిల, హైలెవల్ పనులు మొదలయ్యాయయని చెప్పారు. సోమశిలలో వరదల్లో కొట్టుకుపోయిన సోమేశ్వరాలయాన్ని కూడా సుమారు 9 కోట్లతో పునిర్మిస్తున్నామని చెప్పారు. ఇటీవలే శృంగేరి పీఠాధిపతి వారు సోమేశ్వరాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం పూర్తిగా ప్రాజెక్టులను గాలికొదిలేసిందని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో తమ ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి చెప్పారు. పెండిరగ్ పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. నదుల అనుంధానం చేసి రైతాంగానికి పుష్కలంగా సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యాచరణతో ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో మంత్రి పలు అంశాలను చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును 89వేలు పూర్తిచేశారని, మరింత వేగంగా సభ్యత్వ నమోదును పూర్తి చేయాలని సూచించారు. సాగునీటి సంఘాల సభ్యులతో కలిసి అన్ని సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తానని, పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడ్తామని మంత్రి చెప్పారు.

# కస్తూరయ్య భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళి



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, డిశంబర్ 18)

తెలుగుదేశం పార్టీ నాయకుడు కస్తూరయ్య భౌతిక కాయానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళి అర్పించారు.కాస్తూరయ్య మంగళవారం అనారోగ్యంతో మరణించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం ఉదయం వరదయ్య పాలెం మండలంలోని మృతుని స్వగ్రామమైన కదూరు హరిజనవాడకు చేరుకొని కస్తూరయ్య బౌతిక కాయానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి,పార్టీ కూటమి ప్రభుత్వం మృతుని కుటుంబానికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే బరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ గ్రంథాలయం ఏర్పాటు చేయాలి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 18)

రాష్ట్ర అధ్యక్షులు వంగిపరపు అప్ప రెడ్డన్న ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా అధ్యక్షులు గోచిపతల చిన్నబాబు గౌరవ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, గ్రంథాలయము 50 సెండ్ల స్థలము గ్రంథాలయం నిర్మించడానికి గోచి పతల చిన్న బాబు నేను నా సొంత డబ్బులతో ప్రకాశం జిల్లా కలెక్టర్ దృష్టికి ఏపీ స్టేట్ ఎస్సీ కమిషన్ దృష్టికి సెంట్రల్ ఎస్సీ కమిషన్ దృష్టికి సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి , కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి దృష్టికి ఈ విధంగా రాష్ట్రస్థాయి మండల స్థాయి ఉన్నత స్థాయి అధికారులు అందరూ కూడా గ్రంధాలయానికి స్థలం కేటాయించాలని అజీస్ పురం రెవిన్యూ సర్వే నెంబర్ 60/2 డాక్టర్ బి.ఆర్ కమ్యూనిటీ హాలు గ్రంధాలయము అంబేద్కర్ ఆలోచన విధానం కలిగి ముందుకు సాగుతున్న నేపథ్యంలో కొందరు కుట్ర పూర్వితంగా అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఏపీ దళిత వేదిక తరపున ఎన్ని ఆటంకాలు వచ్చినా అవసరమైన చర్యలకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం హైకోర్టులో కూడా పిటిషన్ ఫైల్ చెప్పేస్తానని మనువాదులకు ఏమాత్రం భయపడనని ప్రకాశం జిల్లా కలెక్టర్ వారు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలియజేశారు అంబేద్కర్ భవనానికి స్థలాన్ని కేటాయించలని గోచిపాతల చిన్నబాబు కోరారు.

# ఎంపీ వేమిరెడ్డితో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికైన తెలుగు అధికారులు ప్రత్యేకంగా కలిశారు. ఢిల్లీలోని పార్లమెంట్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొంటున్నారు. శిక్షణలో భాగంగా ఎంపీ వేమిరెడ్డిని కలిసిన సదరు అధికారులు ఆయనతో భేటీ అయ్యారు. పార్లమెంట్‌కు సంబంధించి విధివిధానాలు, క్రమశిక్షణ, ఇతర అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్‌లో తన అనుభవాలను సదరు అధికారులకు ఆయన ప్రత్యేకంగా తెలిపారు. తన విలువైన సలహాలు, సూచనలను అందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి వారు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఎంతో విలువైన సూచనలు, సలహాలు అందించిన ఎంపీ వేమిరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

# వైరస్ కలంకలం పై స్పందించిన మంత్రి ఆనం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 18)

మర్రిపాడు మండలం వెంకటాపురంలో బుధవారం వైరస్ కలకలం రేపింది. దీనిపై రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని వెంకటాపురం గ్రామంలో ఆరేళ్ల బాలుడికి సేవకుడు పై సమాచారం వచ్చిందన్నారు. వేణు వెంటనే వైద్య సిబ్బందిని పంపించడం జరిగిందన్నారు. అవసరమైతే తిరుపతి నిమ్స్ హాస్పటల్, రుయా హాస్పిటల్ డాక్టర్లను పంపించడం జరుగుతుందన్నారు. బాధితులు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

## ప్రజా వైద్యులు డాక్టర్ మోటూరు టాన్యా జయంతి సందర్భంగా

# బెతూన్ నర్సింగ్ హొమ్‌లో ఉచిత వైద్య శిబిరం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 18)

ప్రజా వైద్యురాలుగా,ఐద్వా మహిళా ఉద్యమ నేతగా డాక్టర్ టాన్య సమాజానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమైనవని డాక్టర్ ఉదయిని అన్నారు. డాక్టర్ మోటూరు టాన్య 83వ జయంతిని పురస్కరించుకొని బెతూన్ నర్సింగ్ హొమ్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ యన్.ఉదయిని మాట్లాడుతూ డాక్టర్ టాన్య ఒంగోలు నగరంలో ప్రముఖ మహిళా వైద్యురాలిగా ప్రజలకు విశేష సేవలు అందించడమే కాక, మహిళలు సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలని, వారిలో చైతన్యం కలిగించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఆమె అందించిన స్ఫూర్తితో బెతూన్ నర్సింగ్ హొమ్ నందు గత 13 సంవత్సరాలుగా ఉచిత వైద్య శిబిరాన్ని నడుపుతున్నట్లు తెలిపారు. మంగళవారం జరిగిన ఈ వైద్య శిబిరం లో 100 మందికి పైగా మహిళలు క్యాన్సర్ కు సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్ లు, ప్యాప్సమీర్, మెముగ్రామ్ లాంటి అనేక టెస్టు లు చేయడం జరిగింది. డాక్టర్ టాన్య మనుమరాలు డా"టి.స్వాతి ఈ శిబిరానికి హాజరైన మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.ప్రజా వైద్యులు డాక్టర్ యన్.రంగారావు టాన్యా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ పురుషోత్తమరావు, డాక్టర్ సందీప్ ప్రకాష్ మాట్లాడుతూ తమ హాస్పటల్ నందు అత్యాధునిక పరికరాలతో ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ వైద్యశాలకు చెందిన డాక్టర్ ఎ.దీప్తి క్యాన్సర్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ డాక్టర్ టాన్యా ప్రజా వైద్యురాలుగానే గాక, ఐద్వా ప్రకాశం జిల్లా ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. టాన్య గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బెతూన్ నర్సింగ్ హొమ్ వైద్యులు మూడు తరాలుగా జిల్లా ప్రజానీకానికి అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యం సామాన్యులకు అందుబాటులో లేని స్థితిలో తాన్యా గారి స్ఫూర్తితో అత్యంత తక్కువ ఖర్చులతో వైద్య సేవలు అందించడమే కాక ఉచిత వైద్య శిబిరాలు ఉచితంగా మందులు పంపిణీ లాంటి అనేక ప్రజాశక్తి కార్యక్రమాలు ఈ వైద్యశాలలో జరుగుతున్నాయని తెలిపారు. టాన్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాల్లు యన్ మాలతి, ఎస్ కె నాగూర్, జి ఆదిలక్ష్మి, కే రాజేశ్వరి, బి రాజ్యలక్ష్మి, బి పద్మ, పి కృపావతి, బి రంగమ్మ, బి పెద్ద గోవిందమ్మ, యస్ డి అమీరున్నీసా, కె విజయలక్ష్మి, పి ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.





# పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దాం

**– గునుకుల కిషోర్ – రైతుల పక్షపాతి మా కూటమి ప్రభుత్వం – ఇది మంచి ప్రభుత్వం**

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిసెంబర్ 18)



గడిచిన ఐదు సంవత్సరాలు నీటి సంఘాల ఎలక్షన్లలో దొంగలు తొక్కింది వైసిపి ప్రభుత్వం అని జనసేన నాయకులు గునుకుల కిషోర్ అన్నారు. నీటి సంఘాల ప్రతినిధులకు ఎంపీటీసీ సభ్యుల కంటే బాధ్యతలు, విధులు, నిధులు ఎక్కువ అన్నారు. సాగు నీటి సంఘాలకి కొత్తగా ఎన్నికైన ప్రతినిధులకు అభినందనల తెలుపుతూ మీ ప్రాంతాలలో నీటి వివాదాలను పరిష్కరించడం, పారదర్శకతను పెంపొందించాలని కోరుతున్నాం. సర్వేపల్లి,కోవూరు నియోజకవర్గాల లో జరిగిన నీటి సంఘ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన జనసేన సభ్యులకు జనసేన పార్టీ జిల్లా కార్యాలయం లో జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ కార్యాలయం గోమతి నగర్ నందు ఘనం గా సన్మానించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు నీటి సంఘాల కి కొత్తగా ఎన్నికైన ప్రతినిధులకు అభినందనలు తెలుపుతున్నాను . పవన్ కళ్యాణ్‌కు రైతుల పట్ల అమితమైన గౌరవం ఉంది . నిన్న కూడా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేసేందుకు ఎద్దుల బండి ద్వారా 27 రోజుల పాటు, 760 కిలోమీటర్లు పైగా ప్రయాణం చేసి వచ్చిన రైతు నవీన్ ని కలిసి తమ సమస్యలు విని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. కౌలు రైతులకు ఎంతో సహాయం చేసారు. గత నెలలో కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ గారిని కలిసి రైతుల సమస్యలను తెలియజేసారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటి కాదు , రెండు కాదు పవన్ కళ్యాణ్ గారు రైతుల కోసం ఎంతో చేస్తున్నారు. అంతే కాకుండా గత ఖరీఫ్ సీజన్లో లో వైసీపీ ప్రభుత్వం రైతుల నుండి 9,40,936 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ చేసింది. కానీ మన కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకూ 16,34,151 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది.దీన్ని బట్టే అర్థం అవుతుంది ఎవరిది రైతుల పక్ష ప్రభుత్వమో అని అన్నారు. మీ ప్రాంతాలలో నీటి వివాదాలను పరిష్కరించడం, పారదర్శకతను పెంపొందించడం, నీటి నిర్వహణను మెరుగుపరచడం, వేలాది కుటుంబాల జీవనోపాధిని ప్రత్యక్షంగా ప్రభావితం చేసే కీలక నిర్ణయాలు మీరు తీసుకోవాలని కోరుకుంటున్నాను. మన సాగునీటి వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా, మన రైతుల మంచి భవిష్యత్తు కోసం వారు కలలు కనిన అభివృద్ధిని సాధించేందుకు మీరు కృషి చేస్తారని నమ్ముతున్నాను.రైతులందరి వాణిని వినిపించే బాధ్యతను మీరు సమర్థవంతంగా నెరవేర్చాలని ఆశిస్తున్నాను.మీ గెలుపు రైతుల పట్ల జనసేన పార్టీ కి ఉన్న సమిష్టి సంకల్పానికి నిదర్శనం.ఇంకొకసారి, మీ విజయానికి అభినందనలు తెలియజేస్తూ, ఇవన్నీ మనసులో పెట్టుకుని మిమ్మల్ని గెలిపించిన అందరి నమ్మకాన్ని , అలాగే మీకు అవకాశం ఇచ్చిన పవన్ కళ్యాణ్ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆశిస్తున్నానన్నారు.